నవతెలంగాణ

సమగ్ర తెలుగు దినపత్రిక

1

నిజామాబాద్-కామారెడ్డి

సోమవారం | జులై 08, 2024 | www.navatelangana.com

ఎస్సారెస్పీకి స్వల్ప ఇన్‌ఫ్లో

- గతేడాదికంటే తగ్గిన నీటిమట్టం



నవతెలంగాణ-నిజామాబాద్‌డెస్క్


ఉత్తర తెలంగాణ వరప్రదాయిని శ్రీరాంసాగర్ ప్రాజెక్టుకు స్వల్ప ఇన్‌ఫ్లో వచ్చి చేరుతోంది. ఎగువ ప్రాంతాల్లో వర్షాలు కురవకపోవడంతో ప్రాజెక్టుకు ఆశించిన స్థాయిలో వరద నీరు రావట్లేదని ప్రాజెక్టు అధికారులు తెలిపారు. ఆదివారం ప్రాజెక్టులోకి 2315 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరుతోంది. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటిమట్టం 1091 అడుగుల(80.5 టీఎంసీల)కు గాను ప్రస్తుతం 1061.20 అడుగుల(11.702 టీఎంసీల) నీరు నిల్వ ఉన్నట్టు అధికారులు తెలిపారు. గతేడాది ఇదే సమయానికి 1065.30 అడుగుల(16.405 టీఎంసీల) నీరు నిల్వ ఉండే. గతేడాదితో పోలిస్తే నీటి నిల్వ సామర్థ్యం తగ్గింది.

భారతవాయు సేన అగ్నివీర్‌లో చేరేందుకు దరఖాస్తుల ఆహ్వానం

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

భారతవాయు సేన అగ్నివీర్‌వాయులో చేరేందుకు దరఖాస్తు ఆహ్వానిస్తుందని నిజామాబాద్ జిల్లాలోని పౌరులు ఈ అవకాశాన్ని వినియోగించు కోవాలని జిల్లా ఉపాధి అధికారి సిరిమల్ల శ్రీనివాస్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. నేటి నుంచి ఈ నెల 28వ తేదీ వరకు దరఖాస్తులు ఆన్‌లైన్‌లో స్వీకరిస్తున్నట్టు తెలిపారు. 03 జులై 2004 నుండి 03 జనవరి 2008 మధ్యలో పుట్టిన.. వివాహం కాని యువతీయువకులు అర్హులని పేర్కొన్నారు. ఇంటర్, దానికి సమానమైన కోర్సు పూర్తి చేసి ఉండాలని దరకాస్తుదారులు ఈ లింక్ ద్వారా https://agnipathvayu.cdac.in దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

ప్రయివేటు వైద్యంపై ఐఎంఏ గుత్తాధిపత్యం



- వారు నిర్ణయించిన ధరలు వసూలు చేయాల్సిందే
- మందులు సైతం వారు చెప్పినవే..
- పేదలకు తక్కువ ధరకు వైద్యం చేస్తే.. వైద్యులపై చివాట్లు
- మాట వినకుంటే అధికారులతో దాడులు చేయిస్తున్న వైనం

నవతెలంగాణ-కామారెడ్డి

వైద్యుడిని ప్రత్యక్ష దైవంగా భావించే సంప్రదాయం మనదేశంలో ఉంది. ఒక వ్యక్తి ప్రాణాపాయ స్థితిలో ఉన్నాడంటే వైద్యుడు ఎంతో కృషిచేసి ఆ వ్యక్తిని రక్షించే ప్రయత్నం చేస్తాడు. అంతటి మహోన్నతమైన వైద్య వృత్తికి పలువురు సేవ చేస్తుంటే.. మరికొందరు కళంకం తీసుకొస్తున్నారు. కామారెడ్డి జిల్లాలో ఐఎంఏ(ఇండియన్ మెడికల్ కౌన్సిల్) చెప్పిన ధరలే ఆస్పత్రులు వసూలు చేయాల్సి ఉంటుంది. పేదలను గుర్తించి ఎవరైనా వైద్యులు ముందుకు వచ్చి ఉచిత వైద్య సేవలు అందిస్తే.. ఐఎంఏ రంగంలోకి దిగి చివాట్లు పెడుతున్నట్టు సమాచారం. దీంతో సేవాభావంతో వైద్య వృత్తిలోకి వచ్చినా.. ఐఎంఏ వల్ల సేవ చేసుకోలేకపోతున్నట్టు పలువురు వైద్యులు తమ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మందులు సైతం వారు చెప్పిందే రాయాల్సి వస్తుండటంతో పేదలకు వేలాది రూపాయలు వెచ్చించాల్సి వస్తుంది.

కామారెడ్డి జిల్లాలో ప్రైవేటు వైద్యం.. ఇండియన్ మెడికల్ అసోసియేషన్ జిల్లా అసోసియేషన్ కనుసన్నల్లో నడుస్తుందని ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. అసోసియేషన్ తీరుతో తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నట్టు పలువురు ప్రయివేటు వైద్యులు సైతం వాపోతున్నట్టు సమాచారం. అసోసియేషన్ (ఐఎంఏ) ను ఎదిరించి కామారెడ్డి జిల్లాలో ఆసుపత్రిని నడిపించుకోలేని పరిస్థితిలో పలువురు వైద్యులు ఉన్నట్లు సమాచారం.

వారు చేయరు? చేసేవారిని చేయనివ్వరు?

కొందరు డాక్టర్లు ధనార్జనే ధ్యేయంగా పెట్టుకొని వారి ఆసుపత్రిలకు వచ్చిన రోగుల నుండి ఇష్టం వచ్చినట్లుగా డబ్బులను దండుకుంటున్నారు. ఆ వైద్యుల్లో మానవత్వం ఉన్న కొందరు వైద్యులు తక్కువ ఫీజుతో ఎక్కువ సేవ చేసి తమ ఆసుపత్రికి వచ్చిన రోజులకు ఎంతో కొంత మేలు చేస్తామంటే ఐఎంఏ నాయకులు వారిని తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నట్టు సమాచారం. ఒకానొక సమయంలో వారి ఆసుపత్రుల పైకి అధికారులను పంపించి మూసి వేసే ప్రయత్నం వరకు వెళ్లారని సమాచారం. దీంతో చేసేది లేక మానవత్వం ఉన్న వైద్యులు పేద ప్రజలకు సేవ చేయలేకపోతున్నామని మానసిక వేదనకు గురి అవుతున్నారు. ఇప్పటికైనా డిఎంహెచ్ఓ అధికారులు ప్రతి ఆసుపత్రి పై నిగా ఉంచి ఏ ఆసుపత్రిలో మందుల చీటీలు ఎలా రాస్తున్నారని పరిశీలించి కంపెనీల పేరు రాసే డాక్టర్లపై చర్యలు తీసుకోవాలని జిల్లా ప్రజలు కోరుతున్నారు.

ఫార్ములాకు బదులు కంపెనీ పేరుతో మందులు

ఇండియన్ మెడికల్ అసోసియేషన్‌ను అదుపులో పెట్టుకున్న ఫార్మసిస్టులు తమ ఇష్టం వచ్చిన మందులను విక్రయిస్తూ డబ్బులు సొమ్ము చేసుకుంటున్నారు. దీన్ని ఆసరా చేసుకున్న డాక్టర్లు సైతం ఫార్ములా పేరు రాయకుండా కంపెనీ పేరు రాస్తూ భారీ దోపిడీకి జిల్లాలో తెరలేదు. బయట మార్కెట్లో 100 రూపాయలకు దొరికే ఫార్ములా ఉన్న మందులు, కంపెనీ పేరుతో 500 నుంచి 1000 రూపాయల వరకు విక్రయిస్తున్నట్లు సమాచారం. ఆ రెండు ~~ఆసుపత్రిలు~~ న్యూరాస్పత్రిలే. కానీ ఒక ఆసుపత్రిలో రాసిన మందులు మరో ఆసుపత్రిలో దొరకవు. దీంతో విదిలేని పరిస్థితిలో రోగులు సైతం ఆ మందులనే కొనుగోలు చేయవలసి వస్తుంది. తద్వారా రోగి తనకు జబ్బు నయమయ్యే వరకు సుమారుగా 4000 నుంచి 5000 వరకు నష్టపోవాల్సి వస్తుంది. దీంతో ఫార్మ కంపెనీల్లో రూపాయి పెట్టుబడికి వంద రూపాయల లాభం చేకూరేలా మూకుమ్మడి దోపిడీకి పాల్పడు తున్నట్టు ఆరోపణలు వ్యక్తమవు తున్నాయి.

తనిఖీలు చేయని డీఎంహెచ్వో

జిల్లాలో ప్రతి ఆసుపత్రిని జిల్లా వైద్యాధికారి తనికి చేయవలసి ఉంటుంది. కానీ జిల్లాలో ఎక్కడా తనిఖీలు చేసిన దాఖలాలు లేవు. తప్పని సరి పరిస్థితిలో తనిఖీ చేసినా లోలోపలనే చేస్తూ వారు ఏం తనిఖీ చేస్తున్నారో ఎవరికి తెలియని పరిస్థితి నెలకొంది. ప్రైవేటు ఆసుపత్రిలో వైద్యులు మందుల చీటీ లో రాసిన మందుల పేర్లు ఆసుపత్రి ఆవరణంలో ఉన్న మెడికల్ వారికి తప్ప మరొకరికి తెలియకుండా పోతుంది. తద్వారా రోగులు వారికి కావలసిన మందులు బయట తక్కువ ధరకు లభించే అవకాశం ఉన్నా అక్కడ కొనుగోలు చేయలేకపోతున్నారు.

చర్యలు తీసుకోకపోవడానికి కారణం ఐఎంఏ నేనా ?

ప్రైవేట్ ఆస్పత్రిలను డిఎంహెచ్ఓ కార్యాలయం నుండి తనిఖీలు చేయకపోవడానికి ఐఎంఏ నేనా కారణమా అని అనుమానాలు సైతం వ్యక్తమవుతున్నాయి. ఐఎంఏ కనుసనల్లోనే డిఎంహెచ్వో కార్యాలయం నడుస్తుందని జిల్లా ప్రజలు పేర్కొంటున్నారు. కామారెడ్డి లో కొన్ని ఆసుపత్రిలు ప్రారంభ సమయంలో పలు రాయితీలను ఇస్తూ ఆసుపత్రిలను నెలకొల్పు తున్నారు. వైద్యుల లక్ష్యం పేద ప్రజలకు సేవ చేయాలని ఉన్న ఐఎంఏ నాయకులు వారిని బెదిరిస్తూ డిస్కౌంట్, ఫ్రీగా వైద్యం ఎలా చేస్తారు అని నిలదీస్తున్నట్లు సమాచారం. పేద ప్రజలకు ఎంతో కొంత సేవ చేయాలని ఉన్న వైద్యులు వీరి ఒత్తిడి తట్టుకో లేక ప్రజల నుండి అధిక డబ్బులు వసూలు చేస్తున్నారు.

కన్నీటి పర్యంతమైన వైద్యురాలు...

తాను పేద ఇంట్లో పుట్టి పేద విద్యార్థిగానే చదువుకొని కష్టపడి డాక్టర్ అయ్యానని, పేదవారి కష్టాలు తనకు తెలియడంతో అలాంటి వారు ఆసుపత్రికి వస్తే వారికి తక్కువ ఖర్చులోనే వైద్యం అందిస్తున్న తరుణంలో ఐఎంఏ నుండి ఫోన్ రావడం ఆమెను పిలిపించి బెదిరించడంతో కన్నీటి పర్యంతమైనట్లు సమాచారం.

వైద్య వృత్తి సేవాభావం



సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వెంకట్‌గౌడ్

ప్రైవేటు ఆసుపత్రులకు వెళ్లాలంటేనే భయపడుతున్న ఈ రోజుల్లో కొందరు ప్రైవేటు ఆసుపత్రులోని వైద్యులు మానవత దృక్పథంతో పేద ప్రజలకు సేవ చేయాలని ఉన్న ఐఎంఏ నాయకుల బాధలు భరించలేక వీరికి సేవల చేయలేకపోతున్నారు. ఐఎంఏ నాయకుల్లో కొందరు కార్పొరేట్ లాంటి ఆసుపత్రిలను పెట్టుకొని ధనార్జనే ధ్యేయంగా ఆసుపత్రి నడుపుతూ పేద ప్రజల నుండి అధిక డబ్బులు వసూలు చేస్తున్నారు. మానవత్వ దృక్పథంతో పనిచేసే వైద్యులను సైతం చేయనివ్వాలి. నిత్యం కూలీ చేసే ప్రజలు ఆసుపత్రి పాలైతే అప్పులు చేసి ఆ అప్పులను సంవత్సరాలు తరబడి తీరుస్తున్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలో అన్ని సౌకర్యాలు లేకపోవడంతో పేద ప్రజలు సైతం ప్రైవేటు ఆసుపత్రులకు వెళ్ళక తప్పడం లేదు. ప్రైవేటు ఆసుపత్రిలో మందుల చీటిపై ఫార్ములా పేరు రాయాలని ప్రభుత్వం చెబుతున్నా ప్రైవేట్ వైద్యులు మాత్రం ఫార్ములా పేరు రాయకుండా ఫార్ములా కంపెనీలకు అమ్ముడు పోయి కంపెనీల పేరు రాస్తున్నారు. అలా రాసేలా డిఎంహెచ్ఓ అధికారులు ఆసుపత్రులపై నిఘాపెట్టి ప్రభుత్వ ఆదేశాలను పాటించని ఆస్పత్రిలపై చర్యలు తీసుకోవాలి.

గమ్మత్తులో చిత్తు



- గంజాయి మత్తులో భవిష్యత్తును నాశనం చేసుకుంటున్న పలువురు యువత
- పోలీసులు అవగాహన కల్పిస్తున్నా.. మారని తీరు
- మత్తుకోసం అడ్డతొవ్వలు తొక్కుతున్న వైనం
- తల్లిదండ్రులు తమ పిల్లలను పర్యవేక్షిస్తే మేలు

నవతెలంగాణ-ఏర్గట్ల

గంజాయి మత్తులో పలువురు యువత తమ భవిష్యత్‌ను చిత్తు చేసుకుంటున్నారు. భావి భారత పౌరులుగా ఎదగాల్సిన వారు మత్తుకు బానిస అవుతుండ్రు. మార్గదర్శులు కావలసిన వారు మత్తుకోసం అడ్డతోవలు తొక్కుతుండ్రు. గుప్పుమని పీలుస్తుండ్రు, మతి ఉండక గతి తప్పుతుండ్రు. రింగురింగుల పొగలో మయాలో కమని విహరిస్తుండ్రు. ఈ రోజు మీద ఆశ పెట్టుకుంటలే, రెపటికోసం కుటుంబానికి భరోసా ఇవ్వట్లే అన్నట్లు తయారవుతున్నారు. గంజాయి పీల్చాక తన్మయత్వం కోల్పోయి విచిత్రంగా ప్రవర్తిస్తున్నారు. ఉదయం, రాత్రి అనే తేడా లేదు లేకుండా, జన సంచారంలో చెవులు చిల్లులు పడేలా రయ్యున బైక్ చప్పులు చేస్తూ... పెద్ద చిన్న చూడకుండా వింత ప్రవర్తనలు చేస్తున్నారు. అందిన దానితో అకారణంగా దాడులు చేస్తూ.. ప్రజలను భయాందోళనకు గురిచేస్తున్నారు. ఎప్పటికి ఆగుతుందో ఈ రాక్షస వికృత క్రీడా.

బాల్కొండ నియోజకవర్గంలో గంజాయి మత్తు గుప్పుమంటోంది. దాన్ని కట్టడి చేసేందుకు పోలీసులు ఉక్కుపాదం మోపు తున్నా.. వైపు వారి కండ్లను కప్పి నిర్మల్, హైదరాబాద్ లాంటి ప్రాంతాల నుండి గంజాయి వస్తూనే ఉన్నట్టు సమాచారం. గంజాయిని అరికట్టడానికి రాష్ట్ర ప్రభుత్వం పోలీస్‌ల సహాయంతో దాడులు నిర్వహిస్తున్న పుటికి గంజాయి మాఫియాకు అడ్డు, అదుపూ లేకుండా పోయింది. ఊరు చివరన ఉన్న నిర్మానుష్య ప్రదేశాలతో పాటు, అనువుగా ఉన్న ప్రాంతాలను చూసుకుంటూ ఒకచోట చేరి గంజాయిని గుప్పుగా పీలుస్తున్నట్టు స్థానికంగా చర్చలు వినిపిస్తున్నాయి.

ఏర్గట్ల మండలానికి చెందిన ఇద్దరు యువకులు గతంలో గంజాయి సప్లై చేయగా.. వేర్వేరు జిల్లాల్లో, వేర్వేరుగా పట్టుబడి వారి భవిష్యత్ నే ప్రశ్నార్థకం చేసుకున్నారు. గంజాయి విషయమై పోలీస్‌లు గ్రామాల్లో, పాఠశాలలో తిరుగుతూ... కళాజాత రూపంలో, స్టేషన్ పరిధి నుండి స్వతహాగా ఎంత అవగాహన కల్పించినా యువత వారి మాటలు పెడచెవిన పెడుతూ... గంజాయి కొనడం, పీల్చడం మాత్రం ఆపడం లేదు.

కుటుంబీకులు ఓ కంట కనిపెట్టాలి

తల్లిదండ్రులు వారి కొడుకు ఎటువెళు న్నాడు, పొద్దంతా ఎటువంటి కార్యక్రమాల్లో పాల్గొంటున్నాడో ఆరా తీస్తే చేయిదాటే లోపే చెడు అలవాట్లకు బానిస కాకుండా అరికట్టే అవకాశం ఉంటుంది. అలాగే వారికి చదవు చెప్పే గురువులు వారి తల్లిదండ్రుల తర్వాత బాధ్యత తీసుకుని విద్యార్థి అలవాట్లు, నడవడికలు ఎప్పటికప్పుడు వారి కుటుంబానికి తెలియ జేస్తూ.. ఉంటే కొంతలో కొంత విద్యార్థి భవిష్యత్ మార్చే అవకాశం ఉంటుంది. గంజాయిపై రాష్ట్రప్రభుత్వం తీసుకువచ్చిన కఠిన చట్టాలతోనైనా యువత మార్పు చెందే అవకాశం ఉంటుందో లేదో వేచి చూడవలసిందే.

అనుమానిత ప్రాంతాల్లో పెట్రోలింగ్

ఏర్గట్ల ఎస్సై మచ్చేంధర్ రెడ్డి

యువతకు అవగాహన కల్పిస్తున్నాం. గంజాయి పీల్చే అనుమానిత ప్రదేశాల్లో పెట్రోలింగ్ నిర్వహిస్తున్నాం. ఇప్పటికే కొందరిని దాడులు చేసి పట్టుకున్నాం. గంజాయిపై ఎవరైనా సామాజిక బాధ్యత తీసుకుని టోల్ ఫ్రీ నంబర్లు 14446కి గాని , యాంటీ నార్కోటిక్ డ్రగ్స్ బ్యూరో కంట్రోల్ రూమ్ నంబర్ 8712671111 ఫోన్ చేసి సమాచారం ఇస్తే డ్రగ్స్ పీల్చే వారిని,అమ్మేవారిని కచ్చితంగా పట్టుకుంటాం. మాకు సమాచారం ఇచ్చిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతాం. అలాగే గంజాయి నిర్మూలనలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు వారి వంతుగా సామాజిక బాధ్యత తీసుకోవాలి.



సిద్ధమైన నారుమడి



నాట్లు వేసేందుకు గొర్రు కొడుతున్న ట్రాక్టర్‌తో

ఆగుతూ.. సాగుతూ



నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

వర్షాకాలం సీజన్ ప్రారంభమైనా జిల్లా వ్యాప్తంగా ఆశించిన స్థాయిలో వర్షాలు కురవలేదు. దీంతో సాగుపై సందిగ్ధం నెలకొంది. ఈ క్రమంలో బోరుబావుల్లో నీరు పుష్కలంగా ఉన్న పలువురు రైతులు నారుమడులు వేసి పొలం సిద్ధం చేసుకుంటుండుగా.. వర్షం, కాలువల నీటిపై ఆధారపడిన రైతులు.. వర్షాల కోసం ఎదురుచూపులు తప్పడం లేదు. అయితే గత రెండుమూడు రోజులుగా అడపా దడపా వర్షాలు కురుస్తుండటంతో సాగు పనులు జోరందుకున్నాయి. నారు వేస్తూ పొలాలను సిద్ధం చేస్తున్నారు. దీంతో గ్రామీణ ప్రాంతాల్లో కోలాహలం నెలకొంది. అయితే భారీ వర్షాలు కురిస్తే మరింత ఉపశమనం లభించే అవకాశం ఉందని రైతులు భారీ వర్షాల కోసం ఎదురుచూస్తున్నారు.



నాట్లు వేస్తున్న మహిళా రైతులు, కూలీలు



చివరి దశలో చేయూత లేదు

- పలువురు రిటైర్డ్ అంగన్‌వాడీ టీచర్‌ల, ఆయాల ఆవేదన
- సీఐటీయూ ఆధ్వర్యంలో రెండో రోజూ కొనసాగిన నిరసన

నవతెలంగాణ-కంఠేశ్వర్

ఏండ్లుగా తమ సర్వస్వం ధారపోసి పిల్లలకు పౌష్టికాహారం అందించడంతో పాటు ప్రీ మెట్రిక్ విద్యను అందజేసినా.. తమకు జీవితం చివరి దశలో ఎలాంటి ఆధారం, చేయూత ప్రభుత్వం నుంచి లేదని రిటైర్డ్ అంగన్‌వాడీలు, ఆయాలు ఆవేదన వ్యక్తం చేశారు. అంగన్‌వాడీలకు రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ అందజేసి పెన్షన్ అమలు చేయాలని డిమాండ్ చేస్తూ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్(సీఐటీయూ) ఆధ్వర్యంలో నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని ధర్నా చౌక్‌లో చేపట్టిన నిరసన ఆదివారం రెండో రోజు కొనసాగింది.


ఈ సందర్భంగా యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షులు రమేశ్‌బాబు ధర్నాకు హాజరై మాట్లాడారు. అంగన్‌వాడీలకు రిటైర్మెంట్ బెనిఫిట్స్‌ను పెంచాలని, పెన్షన్ సౌకర్యాన్ని కల్పించాలని డిమాండ్ చేస్తూ జీవో నెంబర్ పదిని రద్దు చేయాలని కోరారు.



రెండో రోజు చేపట్టిన ఆందోళనలో పాల్గొన్న రిటైర్డ్ ఆయాలు, అంగన్‌వాడీలు

ఈ సందర్భంగా తెలంగాణ అంగన్వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) జిల్లా కార్యదర్శి స్వర్ణ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీవో మూలంగా అంగన్వాడి ఆయాలు టీచర్లలో 65 సంవత్సరాల నిండిన వారిని విధుల నుంచి తొలగిచడంతో దశాబ్దాలుగా పనిచేసిన తమకు ప్రభుత్వం ఆదుకోకుండా వదిలివేయటం మూలంగా ఆందోళన చెందుతున్నా రన్నారు. గత సెప్టెంబర్‌లో అప్పటి ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు రిటైర్ అయ్యే అంగన్వాడీ టీచర్లకు రెండు లక్షలు ఆయాలకు లక్ష రూపాయలు చెల్లించాలని పెన్షన్ సౌకర్యాన్ని కల్పించాలని డిమాండ్ చేశారు.

అటు ప్రభుత్వానికి ఇటు కుటుంబానికి భారమయ్యాం



సరస్వతి. రిటైర్డ్ అంగన్‌వాడీ

అంగన్వాడీ కేంద్రాలలో అనేక మంది చిన్న పిల్లలకు ఏండ్లుగా సేవలు చేసి విద్యాబుద్దులు నేర్పిన తాము ప్రభుత్వం నుంచి నిరాదరణకు గురవుతున్నామని అన్నారు. తమ చివరి దశలో ఏ రకమైన ఆధారం లేకపోవడంతో కుటుంబ సభ్యులకు భారంగా మారే పరిస్థితి వచ్చిందని వారు కూడా ఆదరించే పరిస్థితి లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కాబట్టి తమకు పెన్షన్ సౌకర్యం కల్పించి రిటైర్మెంట్ బెనిఫిట్స్‌ను లక్ష రూపాయలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

మా బతుకులు అగమ్యగోచరం



రిటైర్డ్ ఆయా కళావతి

పేదల పిల్లలకు దశాబ్దాలుగా అన్ని రకాల సేవలు చేశాం. ఈ క్రమంలో మా కుటుంబాన్ని సైతం కొన్ని సార్లు విస్మరించాం. చివరి దశలో ప్రభుత్వం నిర్లక్ష్యం చేయటంతో మా బతుకులు అగమ్యగోచరంగా మారాయి. ప్రభుత్వ ఇప్పటికైనా ప్రభుత్వం తమ సమస్యలను పరిష్కరించాలని కోరారు.

స్కాంలపైనే కేసీఆర్, కేటీఆర్, కవిత దృష్టి

- అందుకే పదేండ్ల గడీల పాలనను ప్రజలు బద్దలు కొట్టారు
- అధికారంలోకి రాగానే 30 వేల ఉద్యోగాలు భర్తీ చేస్తున్నాం
- రూరల్ ఎమ్మెల్యే డా.భూపతిరెడ్డి

నవతెలంగాణ-ధర్పల్లి

రాష్ట్రంలో గత పది సంవత్సరాలుగా కేసీఆర్ అనే దుర్మార్గుడి పాలన, గడీల పాలన కొనసాగిందని ఆ పాలనకు ప్రజలు చరమగీతం పాడి కాంగ్రెస్‌ను గెలిపించినట్టు రూరల్ ఎమ్మెల్యే డా.భూపతిరెడ్డి అన్నారు. ప్రాజెక్టుల రీడిజైన్ల పేరుతో తండ్రి వేలకోట్లు దోచుకుంటే, కొడుకు ధరణి పేరుతో భూములను , కూతురు లీక్కర్‌పై దృష్టి పెట్టి ధనార్జనే ధ్యేయంగా పనులు చేశారు తప్పా.. ప్రజలకు మంచిచేసే ఏ ఒక్క పని చేయలేదని ధ్వజమెత్తారు. ఆదివారం మండలంలోని ఆయా గ్రామాల్లో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొ న్నారు. హొన్నాజిపేటలో సొసైటీ ఆధ్వర్యంలో 12 లక్షలతో నిర్మించిన గిడ్డంగిని ప్రారంభిం చారు. సీతాయిపేట గ్రామం నుండి మద్దుల్ తండా బైపాస్ వరకు కోటి 55 లక్షలతో ఎస్ టీ ఎస్ డి ఎఫ్ నిధులనుండి చేపట్టబోయే డబుల్ రోడ్ పనులను శంకుస్థాపన చేశారు. అలాగే నడిమి తండాలో 60 లక్షలతో రోడ్డు పనులను శంకుస్థాపన చేశారు.



రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే

గత పది సంవత్సరాల్లో కేసీఆర్ నిరుద్యోగులకు ఒక్క ఉద్యోగం ఇవ్వలేదని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన మాట ప్రకారము నేటికే రాష్ట్రంలోని 30 వేల నిరుద్యోగ యువకులకు ఉద్యోగాలు అందించిందన్నారు. ప్రజలు బండకేసి కొట్టితే ఫామ్‌హౌస్ లో పండుకొని కాంగ్రెస్ పార్టీ పడిపోతుందని ప్రగల్భాలు పలుకుతున్నాడని ఆగ్రహం వెక్తం చేశారు. కార్యక్రమములో మండల అధ్యక్షుడు ఆర్మూర్ చిన్న బల్ రాజ్ ,మనోహర్ రెడ్డి,చెలిమెల నర్సయ్య,చెలైలా శ్రీనివాస్,సుభాష్ రెడ్డి,జాన్ రెడ్డి,శ్రీనివాస్ రెడ్డి,సొసైటీ చేర్మెన్ జనార్దన్ రెడ్డి, సీఈఓ గంగ నర్సయ్య, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి



ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

నవతెలంగాణ-నిజాంసాగర్

నిజాంసాగర్ మండలంలోని మాగి గేటు వద్ద ఆదివారం సాయంత్రం చోటుచేసుకున్న రోడ్డు ప్రమాదంలో ఒక మహిళ మృతి చెందింది. మరో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. ఎస్ఐ సుధాకర్ తెలిపిన వివరాల ప్రకారం.. నాగిరెడ్డిపేట్ మండలం జప్తి జానకంపల్లి గ్రామానికి చెందిన సునీత (32) ద్విచక్ర వాహనంపై స్వగ్రామానికి వెళ తుండగా మాగి గేటు వద్ద గుర్తుతెలియని లారీ ఢీకొట్టడంతో సునీత అక్కడికక్కడే చనిపోయింది. దేవిచంద్, శ్రీనివాస్‌కు తీవ్ర గాయాలు అవ్వగా చికిత్స నిమిత్తం వారిని బాన్సువాడ ఆసుపత్రికి తరలించారు. ఎస్సై సుధాకర్ ఘటన స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

గ్రామదేవతలకు జలాభిషేకం



గంగ నీళ్లతో వస్తున్న గ్రామస్తులు

నవతెలంగాణ-ముప్కాల్

ముప్కాల్ గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం గ్రామదేవతలకు జలాభిషేకం నిర్వహించారు. శ్రీరాంసాగర్ గోదావరి నది ఒడ్డు నుంచి గంగనీళ్లను తెచ్చి డప్పు వాయిద్యాల మధ్య నృత్యాలు చేస్తూ గోదావరి నది నుండి తెచ్చిన నీళ్లతో గ్రామ దేవతలకు జలాభిషేకం నిర్వహించారు. మహిళలు బోనాలతో దేవతలకు నైవేద్యం సమర్పించారు. గ్రామ దేవతలకు గంగనీళ్ల సమర్పించడం ద్వారా వర్షాలు సంవృద్ధిగా కురుస్తాయని, పంటలు పుష్కలంగా ఉంటాయని గ్రామస్తుల నమ్మకం. కార్యక్రమంలో గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, కుల వృత్తి దారులు, మహిళలు యువజన సంఘం నాయకులు పాల్గొన్నారు.

అ'పూర్వ'సమ్మేళనం



ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

నవతెలంగాణ-బాల్కొండ

మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక ఉన్నత పాఠశాల 1997-1998 సంవత్సర పదవ తరగతి విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం వి కన్వెన్షన్ హాలులో ఘనంగా నిర్వహించారు. పూర్వ ఉపాధ్యాయ బృందం విద్యార్థులు దాదాపు 26 వసంతాల తర్వాత అందరినీ కలవడం చాలా ఆనందంగా ఉందన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు, ఉపాధ్యాయులు తమ మనోగతం, ఉపన్యాసాలు ఇచ్చారు. విద్యార్థి దశ జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ ఒకరినొకరు ఆత్మీయంగా పలకరించుకున్నారు. కార్యక్రమంలో భాగంగా ఉపాధ్యాయులను శాలువా, జ్ఞాపికలతో ఘనంగా సత్కరించారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో పూర్వఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కోఆర్డినేటర్ బదిలీపై వెళ్లడం బాధాకరం

- వీడ్కోలు సమావేశంలో 108 ఉద్యోగులు



సన్మానించిన పలువురు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

జిల్లా కోఆర్డినేటర్‌గా సేవలు అందించిన విజయేందర్ బదిలీపై వెళ్లడం బాధాకరంగా ఉందని 108 ఉద్యోగుల సంఘం రాష్ట్ర కార్యదర్శి సుంకరి విజయ్ కుమార్ అన్నారు. బదిలీపై వెళ్తున్న, ఇక్కడికి వస్తున్న అధికారులను జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ఘనంగా సన్మానించారు. ముఖ్య అతిథిగా ప్రోగ్రాం మేనేజర్ రవికుమార్ పాల్గొనగా జిల్లా అధ్యక్షుడు సంతోష్ రెడ్డి మాట్లాడుతూ బదిలీపై వెళ్తున్న విజయేందర్ రెండేళ్లుగా ప్రజలకు అత్యవసర సమయంలో 108 వాహనాలను అందుబాటులో ఉంచి సేవలందించారని గుర్తు చేశారు. ఉద్యోగులకు, ప్రభుత్వ యంత్రాంగానికి, సంస్థను సమన్వయ పరుస్తూ విధులు నిర్వహించేలా చేశారని చెప్పారు. ఈయన స్థానంలో కొత్తగా కోఆర్డినేటర్‌గా చేరిన శ్రీకాంత్ సైతం 108 పరంగా ప్రజలకు సేవలందిస్తారని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో నిర్మల్ జిల్లా కోఆర్డినేటర్ లింగచారి, ఉద్యోగులురమేష్, గణేష్, నరేందర్ భీమ్ రావు తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గానికి రూ.1.25 కోట్ల నిధులు

- విడుదల చేసిన మంత్రి సీతక్క

నవతెలంగాణ-ఆర్మూర్



తెలంగాణా పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ ధనసరి అనసూయ సీతక్క రూ.1.25కోట్లు నిధులు మంజూరుచేసినట్టు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ప్రొద్దుటూరి వినయ్ కుమార్ రెడ్డి తెలిపారు. ఆదివారం వినయ్‌రెడ్డి మంత్రి సీతక్కను కలిసి నియోజకవర్గనికి 1.25 కోట్లు నిధులను మంజూరు చేయించినట్టు చెప్పారు. నియోజకవర్గంలో నినందిపేట్ మండలం కౌల్‌పూర్ గ్రామంలో ఎస్సీ మల్టీపర్పస్ ఫంక్షన్ హాల్ పొడిగింపునకు రూ. 50 లక్షలు, మండల కేంద్రంలోని గౌడ ఫంక్షన్ హాల్ కోసం 25 లక్షల రూపాయలు. పద్మశాలి ఫంక్షన్ హాల్ కోసం 25లక్షలు. మండలకేంద్రంలో మైనారిటీ ఫంక్షన్ హాల్ కోసం 25 లక్షల రూపాయలు మంజూరు చేయించినట్టు తెలిపారు. ఈ సందర్భంగా అడిగిన వెంటనే నిధులు మంజూరు చేసిన మంత్రి కి ధన్యవాదాలు తెలిపినారు .

రెజ్లింగ్ ఎంపికలు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

నిజామాబాద్ జిల్లా మ్యాట్ రెజ్లింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిజామాబాద్ లోని డిఎస్ఏ స్విమ్మింగ్ పూల్‌లోని రెస్లింగ్ హాల్లో అండర్-23 పురుషుల, మహిళల రెజ్లింగ్ సెలక్షన్స్ నిర్వహించారు. ఈ పోటీలకు 30 మంది క్రీడాకారులు హాజరయ్యారు మాలవత్ మనోహర్ 57కిలోలు, ఆర్.అమర్సింగ్. 60కిలోలు, బీ.గోపాల్ 70 కిలోలు, ఆర్.శ్రీకాంత్. 55కిలోలు, బీ.సురేందర్. 57కిలోలు, ఎండి సోఫియాన్. 65కిలోలు, మహిళలు ఎస్ హేమ బింధు 72కిలోలు, ఎస్ కే. నెహా. 76 కిలోల విభాగంలో సెలెక్ట్ అయ్యారు. గెలుపొందిన క్రీడాకారులను ఈనెల 14న హైదరాబాద్ లో జరిగే రాష్ట్రస్థాయి రెజ్లింగ్ పోటీలకు పంపడం జరుగుతుందని తెలిపారు. ఈ పోటీలకు ముఖ్యఅతిథిగా నిజామాబాద్ జిల్లా రెజిలింగ్ అసోసియేషన్ అధ్యక్షులు శ్రీ భక్తవత్సలం, ఉపాధ్యక్షులు రాజ్ కుమార్ సుబేదార్, జైపాల్ హాజరయ్యారు. నిజామాబాద్ జిల్లా రెజ్లింగ్ అసోసియేషన్ సెక్రటరీ ఐ దేవేందర్, సురేష్, సుజాత, కామారెడ్డి జిల్లా కదిలింగ అసోసియేషన్ వినోద్ కుమార్, దానయ్య సార్, ఆధ్వర్యంలో నిర్వహించారు.

జగన్నాథ రథోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే

- గ్రామా అభివృద్ధి సభ్యుల ఘన సన్మానం

నవతెలంగాణ-ధర్పల్లి

గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో మండలకేంద్రంలో ఆదివారం నిర్వహించిన శ్రీ జగన్నాథ రథ మహోత్సవంలో రూరల్ ఎమ్మెల్యే డా,భూపతిరెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈసందర్భంగా కమిటీ సభ్యులు పలు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. ఆలయానికి కమిటీ భవనానికి నిధులు, సీసీ రోడ్డు, ఐమాక్ లైట్ కోరారు. ఆలయ అభివృద్ధిలో తన బంధు కృషిగా నిధులను అందించేందుకు కృషి చేస్తానని అన్నారు. అనంతరం కమిటీ సభ్యులు ఎమ్మెల్యేకు శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో అధ్యక్షుడు అరుగుల బల్ రెడ్డి, సభ్యులు లింబా గౌడ్, అబ్దుల్ హమీద్, బొర్రన్న, రాము, లక్పతి, గౌరారం పవన్, మనోహర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

బోనాల వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే దంపతులు



బోనం ఎత్తుకున్న ఎమ్మెల్యే

నవతెలంగాణ-ఆర్మూర్

హైదరాబాద్ గోల్కొండ కోటలో జరుగుతున్న జగదాంబిక మాత అమ్మవారి తొలి బోనాల కార్యక్రమంలో ఆర్మూర్ ఎమ్మెల్యే రాకేష్ రెడ్డి సతీమణి పైడి రేవతిరెడ్డితో కలిసి ఆదివారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. తెలంగాణలో బోనాలకు అత్యంత ప్రాముఖ్యత ఉందని. ప్రతి పనికి ముందు అమ్మవార్ల మొక్కులు చెల్లించడం ఆనవాయితీ అని అన్నారు. గోల్కొండ బోనాలతో రాష్ట్ర వ్యాప్తంగా బోనాల పండుగ ప్రారంభం అవుతుందని, ప్రభుత్వం భక్తులకు ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు చేయాలని అన్నారు. కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ నాయకులు శ్రీనివాస రాజ, బజరంగ్‌దళ్ నాయకులు నాగేశ్వర్, తదితరులు పాల్గొన్నారు.

కోతులు, కుక్కల బెడద

- బయటకు వెళ్లాలంటే భయపడుతున్న జనం

నవతెలంగాణ-ఆర్మూర్



రోడ్డుపై గుంపులుగా తిరుగుతున్న కోతులు

పట్టణంలో కోతులు, కుక్కల బెడదతోని ప్రజలు బయటకు వెళ్లాలంటేనే భయపడుతున్నారు. పట్టణ కేంద్రంతో పాటు మున్సిపల్‌లో విలీనమైన మామిడిపల్లి, పెర్కిట్‌లలో నిత్యం కోతుల బెడదతో స్థానికులు, ప్రభుత్వ కార్యాలయాలకు వచ్చే ప్రజలు జంకుతున్నారు. కొన్నేళ్ల నుంచి కోతుల సంచారం నిత్యం పెరుగుతుండడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అడవిలో ఉండాల్సిన కోతులు జనవాసాల్లో ఉండి ప్రజలను బెంబేలెత్తిస్తున్నాయి. పదుల సంఖ్యలో కోతులు ఇంట్లో ప్రవేశించి ఇంట్లో వాళ్లందరినీ భయపెడుతున్నాయి. ఉదయాన్నే ఇంటి పనులు చేసుకుందాం అనుకునే సరికి ఇంట్లో వాళ్లకు కోతులు చుక్కలు చూపిస్తున్నవి. ఇంటి పైన నిలబడి దాడికి సిద్ధంగా ఉంటున్నాయి. ప్రతిరోజు ఉదయం సాయంత్రం కోతులతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారూ. పట్టణంలోని ఆర్డీవో కార్యాలయం ఆవరణలో, మున్సిపల్, బాలికల పాఠశాల, జంబి హనుమాన్, గోల్ బంగ్లా, ముదిరాజ్ గల్లి, జండాగల్లి, హుస్నాబాద్ కాలనీ, చుట్టుపక్కల కాలనీలో కోతులు గుంపులుగా తిరుగుతూ బీభత్సం సృష్టిస్తున్నాయి.

వాహనాల కవర్లు ఉంచడం లేదు..

పట్టణంలోని జంబి హనుమాన్ ఆలయ ప్రాంగణంలోని బాలికల ఉన్నత పాఠశాల, ఇతర ప్రభుత్వ కార్యాలయాల వద్ద బైకులు, కార్లు పార్కింగ్ చేసి కార్యాలయానికి వెళ్లి తిరిగి వచ్చే లోపు పెట్రోలు ట్యాంకు కవర్లు, సీటు కవర్లను చింపేస్తున్నాయి. దీంతో వాహనాలను కూడా నిలపడానికి భయపడుతున్నారు. కోతుల నివారణ కోసం అధికారులు గతంలో కోతులను పట్టించారు కానీ మళ్ళీ కోతుల మందలు మందలుగా చేరాయి.

వర్షాకాలంలో తీవ్ర ఇబ్బందులు..

కోతులు ఇళ్లలోకి ప్రవేశించి పండ్లు, కూరగాయలు, బియ్యం పప్పులు ఎత్తుకు పోతున్నాయి. ఇళ్లపై పెంకాలను తొలగిస్తున్నాయి. దీంతో వర్షాకాలంలో ఇల్లు కురుస్తున్నాయని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇంట్లో ఉన్న తలుపులు ఒక్క నిమిషం తెరిచి ఉన్న లోనికి ప్రవేశించి తినుబండరాలు తీసుకు వెళుతున్నవి. చిన్నపిల్లలు ఒంటరిగా ఆడుకుంటున్న సమయంలో కోతులు ఎక్కడ దాడి చేస్తాయో అని ప్రజలు భయపడాల్సి వస్తుంది. ఇటీవల పట్టణంలోని ఒక కాలనీలో మహిళ, బాలునికి కోతి దాడి చేయగా ప్రభుత్వ ఆసుపత్రిలో చూయించుకున్నారు.

కుక్కల బెడదతో ఆందోళన..

పట్టణంలోని పలు వార్డులతో పాటు, మున్సిపల్‌లో విలీనమైన పెర్కిట్, మామిడిపల్లిలోని పలు కాలనీలలో కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. ముఖ్యంగా పాఠశాలలకు వెళ్లే సమయంలో బాల, బాలికలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

కోతుల బెడద తప్పించాలి.. వాయిస్



పట్టణంలో కోతులు ప్రతిరోజు హల్చల్ చేస్తూ ప్రజలను భయాందోళనకు గురి చేస్తున్నాయి. ఇంట్లోకి చొరబడి తినుబండారాలు బియ్యం ఇతర వస్తువులు తీసుకుపోతున్నాయి. దాంతో పాటు దాడి చేస్తున్నాయి. కోతులను అడవుల్లో వదిలే విధంగా అధికారులు, నాయకులు చర్యలు తీసుకోవాలి.

ఉమారాణి, ఆర్మూర్.

విలీన గ్రామాల్లో సైతం.. వాయిస్



మున్సిపల్‌లోని విలీన గ్రామాలలో కుక్కల బెడద ఎక్కువయింది. కొన్నిచోట్ల చిన్నారులపై దాడులు చేశాయి. సంబంధిత అధికారులు కుక్కల బెడదను నివారించాలి.

మల్యాల నవీన్, మామిడిపల్లి.

మత్తు పదార్థాలు, ప్రలోభాలకు యువత గురికావద్దు

- పీవైఎల్ రాష్ట్ర అధ్యక్షులు ప్రదీప్

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ



మాట్లాడుతున్న పీవైఎల్ రాష్ట్ర అధ్యక్షులు ప్రదీప్

ప్రగతిశీల యువజన సంఘం(పీవైఎల్) జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నగరంలోని ఎస్.ఆర్ భవన్, కోటగల్లిలో జిల్లాస్థాయి రాజకీయ శిక్షణ తరగతులు ఆదివారం నిర్వహించారు.

హక్కుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఆల్గోట్ రవీందర్ ప్రారంభ ఉపన్యాసకులుగా మాట్లాడారు. శిక్షణా తరగతుల్లో యువజనుల కర్తవ్యాల గురించి పివైఎల్ రాష్ట్ర అధ్యక్షులు కే ఎస్. ప్రదీప్ మాట్లాడుతూ.. యువత కులం, మతం మత్తులో పడి ఒకరికొకరు రెస్పాన్సిబులిటీ లేకుండా ఉన్నారన్నారు. మద్యం, మాదకద్రవ్యాల అలవాట్లతో యువత, ప్రజలు బానిసలుగా మునిగితేలుతున్నారని తెలిపారు. ఒక వ్యక్తి గురించే ఆలోచన చేయలేని మానసిక ఒత్తిడికి లోనవుతూ, ఒకరికొకరు చంపుకుననే పరిస్థితులు ఏర్పడ్డాయని అన్నారు. కులం, మతం, మాదక ద్రవ్యాల మత్తులో యువత పెడదారిన పడకుండా ప్రగతిశీల ఆలోచనల వైపు రావాలని కోరారు. కొంతమంది స్వార్థ పూరిత ఆలోచనల వల్ల మత్తు పానీయాలు నీళ్ల కంటే ఎక్కువ దొరుకుతున్నాయని తెలిపారు. మద్యం మత్తు పానీయాలు అమ్మడ్డు నేరం అని చెబుతూనే, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమ్మకాలను రెట్టింపులు చేస్తున్నారని అన్నారు. యువత ప్రగతిశీల ఆలోచన వైపు నడుస్తూ సమాజంలో ప్రజలు, యువత ఎదుర్కొంటున్న సమస్యలపై పోరాటానికి ముందు ఉండాలని పిలుపునిచ్చారు. జన విజ్ఞాన వేదిక రాష్ట్ర కన్వీనర్ చెలిమెల రాజేశ్వర్ మాట్లాడుతూ.. మనిషిని శాస్త్రీయంగా ఆలోచింపజేయనీయకుండా కుల, మత చాందసవాదాలను యువతలో, విద్యార్థుల్లో పెంపొందించేవి మూఢనమ్మకాలని అన్నారు. సైన్స్ ద్వారానే ఈ సృష్టి వచ్చిందని, సైన్స్ వల్లనే నడుస్తుందని తెలిపారు. బాబాలు మూఢనమ్మకాలతో లింగాల విభూదులతో ప్రజలను మోసం చేస్తున్నారని తెలిపారు. వివిధ రకాల ఎక్స్పెరిమెంట్లతో విద్యార్థులు యువతను చైతన్యవంతం చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో పివైఎల్ నిజామాబాద్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు అనిశ్, నవీన్ కుమార్, సిపిఐ (ఎంఎల్) మాస్ లైన్ నిజామబాద్ డివిజన్ సహాయ కార్యదర్శి సాయ గౌడ్, జిల్లా ఉపాధ్యక్షులు సాయిబాబా, జిల్లా కోశాధికారి డి.గంగాధర్, జిల్లా నాయకులు కిరణ్, సాయి చందు, ప్రసాద్,డప్పు గంగన్న, మహిపాల్, నసీర్, గంగన్న తదితరులు పాల్గొన్నారు.

టెక్ మహీంద్రా మాస్టర్ ట్రైనర్ గ్రాడ్యుయేషన్ సర్టిఫికెట్

- అందుకున్న ఉపాధ్యాయులు

నవతెలంగాణ-ఏర్గట్ల

టెక్ మహీంద్రా మాస్టర్ ట్రైనర్ గ్రాడ్యుయేషన్ సర్టిఫికెట్ ను ఏర్గట్ల ప్రభుత్వ పాఠశాల, నిజామాబాద్ దుబ్బ ప్రభుత్వ పాఠశాలలకు చెందిన సైన్స్ ఉపాధ్యాయులు గాండ్ల రాజశేఖర్ , చల్లా ముద్దుకృష్ణ సీనియర్ సైంటిస్ట్ డాక్టర్ ఖలీల్ అహ్మద్ చేతుల మీదుగా అందుకున్నట్లు తెలిపారు. టెక్ మహీంద్రా,సైన్స్ అకాడమీ హైదరాబాద్ వారు సంయుక్తంగా మాస్టర్ ట్రైనర్ ఇన్ సైన్స్ ఎడ్యుకేషన్ గ్రాడ్యుయేషన్ సెర్మని హైదరాబాద్‌లోని సాలర్ జంగ్ మ్యూజియంలో ఆదివారం నిర్వహించారు. ఈ శిక్షణ కోర్సులో తెలంగాణ రాష్ట్రం మొత్తంలో 10 మంది ఫిజికల్ సైన్స్,18 మంది జీవశాస్త్ర ఉపాధ్యాయులు మాత్రమే పాల్గొన్నారని తెలిపారు. ఈ సర్టిఫికెట్ అందుకోవడం చాలా సంతోషంగా ఉందని ఉపాధ్యాయులు అన్నారు.



సర్టిఫికెట్ అందజేత

9న సీత్లా పండుగను నిర్వహించుకుందాం

- అల్ ఇండియా బంజారా సేవాసంఘ్

నవతెలంగాణ-భీంగల్ రూరల్

బంజారా గిరిజనులు ఎంతో పవిత్రంగా జారుపుకునే సీత్లా (దాటుడు) పండుగను వేర్వేరు తేదీల్లో కాకుండా అందరూ ఒకే రోజు ఈ నెల 9న మంగళవారం జరుపుకొని జాతి ఐక్యతను చాటాలని యువజన విభాగం అధ్యక్షులు నేనా వత్ నరేందర్ కోరారు. ప్రకృతిని పూజించడం, ప్రేమించడం గిరిజనుల ప్రత్యేకత అని, గిరిజ నుల కట్టు, బొట్టు, వేసాధారణ, ఆచార వ్యవహా రాలు, సంస్కృతి సంప్రదాయాలు అతి పవిత్రమై నవని అన్నారు. పండుగుల సందర్భంగా పశువులను అలంకరించడం గిరిజన జాతి పూర్వీకుల నుండి అనవయితీగా వస్తుందా న్నారు. ఏడుగు రు అమ్మవార్లను కొలువు దిర్చి ప్రజలు, పంట పైర్లు, పశుసంపద ఆరోగ్యాంగా ఉండాలని, పాడిపంటలు సమృద్ధిగా పండాలని ఆశాడ మాసం శుక్లపక్షం రెండవవారం మంగళవారం సీత్లా పండుగను జరుపుకోవడం అనవయితీగా వస్తుందని తెలిపారు. ప్రతి సంవత్సరం ఈ మాసంలో వచ్చే నాలుగు మంగళవారలలో వేర్వేరుగా దాటుడు పండుగను జరుపుతున్నారు, ఆలా కాకుండా ఇక నుంచి బంజారా గిరిజనులంతా ఒక్కటై శుక్లపక్షం(చందనిరాత్) రెండవ మంగళవారం జరుపుకోవాలని కోరారు. గిరిజనుల సంస్కృతి సంప్రదాయాలకు ప్రతికగా నిలిచే సీత్లా భవాని పండుగను 9న రాష్ట్ర వ్యాప్తంగా గిరిజనులంతా జరుపుకోవలని జాతి ఐక్యతను చాటాలని కోరారు.

గంగపుత్రులు..

గౌడ కులస్తులు అన్నదమ్ముల్లా ఉండాలి

- గంగమ్మ తల్లి ఆలయానికి భూమి పూజ చేసిన ఎమ్మెల్యే
- ఇరు వర్గాల్లో సద్దు మణిగిన మనస్పర్థలు
- ఎమ్మెల్యేకు గ్రామస్తుల ధన్యవాదాలు

నవతెలంగాణ-ధర్పల్లి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే భూపతి రెడ్డి

మండలంలోని రేకులపల్లి గ్రామంలోని గౌడ, గంగపుత్ర కులస్తుల మధ్య భూవివాదంలో గత కొంతకాలంగా గొడవలు జరుగగా, ఇరు వర్గాల సంఘాలకు చెందిన భూమి పక్క పక్కనే ఉండటంతో, హద్దుల విషయంలో తమ ఆరాధ్య దైవం ఆలయం నిర్మిస్తామని గౌడ కులస్థులు, ఇది మాస్థలం ఇక్కడ మేము గంగమ్మ ఆలయం నిర్మిస్తామని గంగపుత్ర కులస్తుల మధ్య గొడవ తారాస్థాయికి చేరి కేసులు సైతం పెట్టుకున్నారు. విషయం తెలుసుకున్న రూరల్ ఎమ్మెల్యే డా ,భూపతిరెడ్డి ఇరు వర్గాలకు పిలిపించి వారితో మాట్లాడారు. సంబంధిత అధికారులతో మాట్లాడి గొడవలు లేకుండా సముదాయించారు. ఆదివారం గంగపుత్ర కులస్తులకు చూపించిన స్థలంలోనే గంగమ్మ ఆలయా నిర్మాణానికి పూనుకున్నారు. ఇందుకు ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే భూపతిరెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈసందర్భంగా అయన మాట్లాడుతూ చిన్న పాటి స్థలం సమస్యతో అన్నదమ్ముల్లా ఉండాల్సిన గ్రామస్థుల మధ్య గొడవలు అయ్యాయని,ఈ సమస్య పరిష్కారం అయినందున గ్రామస్థులు ఎప్పటిలా కలిసిమెలసి ఉండాలని కోరారు. గ్రామమంలో కూలబహిష్కరణలు లాంటివి చేసుకోకుండా, ఒకరిపై ఒకరు కేసులు పెట్టుకోకుండా ఉండాలని అన్నారు. రానున్న రోజుల్లో తనవంతుగా గ్రామాభివృద్ధికి నిధులు అందిస్తానని అన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఆర్మూర్ చిన్న బాలరాజ్, చెలిమెల శ్రీనివాస్, చెలిమెల నర్సయ్య, రాకేష్, మిట్టపల్లి గంగారెడ్డి, గ్రామ మాజీ సర్పంచ్ రాజేందర్, గ్రామ పెద్ద మనుషులు గుజ్జుల నరేందర్ రెడ్డి, ధర్మయ్య, రాములు, నడిపి నర్స రెడ్డి. శ్రీకాంత్, మోహన్, అశోక్, నర్సయ్య, గణేష్, తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
కామారెడ్డి
సోమవారం | జులై 8, 2024 | www.navatelangana.com

పడకల్ లైబ్రరీకి పుస్తకాలు వితరణ

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

పడకల్ గ్రామానికి చెందిన ఉపాధ్యాయులు అంకం నరేష్ శ్రీనివాస్ ప్రోత్సాహంతో వేల్పూర్ మండలం వాడి గ్రామానికి చెందిన ఉపాధ్యాయులు నరసయ్య పడకల్ గ్రామీణ గ్రంథాలయానికి రూ.5000 విలువ గల బాలల కథలకు సంబంధించిన పుస్తకాలను అమెజాన్ ద్వారా కనుగోలు చేసి వితరణ చేశారు. ఈ సందర్భంగా గ్రామ యువత ఆయనకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గణేష్, లోకపురుషోత్తం, అంకం నరేష్, తంబాకుల గంగారెడ్డి, పోశెట్టి, బాలాగౌడ్, సుధాకర్, రవీందర్, వినీత్, ఆకాష్, అశోక్ పాల్గొన్నారు.


పుస్తకాలు వితరణ చేస్తున్న దృశ్యం

శ్రీ మంజునాథ ఆటో యూనియన్ నూతన కార్యవర్గం ఎన్నిక



నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండల కేంద్రంలో శ్రీ మంజునాథ ఆటో యూనియన్ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ మేరకు ఆదివారం సమావేశమైన ఆటో యూనియన్ సభ్యులు నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా బిట్ల అనిల్, ఉపాధ్యక్షులుగా బొడ్డు రాము, కోశాధికారిగా పెండెం మినేష్, కార్యదర్శిగా సుందరి రవీందర్, సలహాదారులుగా ఖాదర్ భాయ్, దాత్రిక రాజేందర్, పిల్లమారి సుధాకర్, నాగపూర్ బాజన్న, ముద్రవేణి రాజేశ్వర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన అధ్యక్షులు, కార్యవర్గ సభ్యులు మాట్లాడుతూ ఆటో యూనియన్ సభ్యుల సమస్యల పరిష్కారానికి తమ వంతు కృషి చేస్తామన్నారు. తమ ఎన్నికకు సహకరించిన యూనియన్ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.

సమయానికి భోజనమందక తల్లడిల్లుతున్న విద్యార్థులు

కస్తూర్బా పాఠశాల విద్యార్థులకు తప్పని తిప్పలు

- ప్రతీ ఆదివారం అంతే సంగతి..
- ప్రిన్సిపాల్ చెప్పినా.. మారని వంట మనుషుల తీరు..


11 గంటల తర్వాత టిఫిన్ కోసం క్యూ కట్టిన విద్యార్థులు

నవతెలంగాణ-నాగిరెడ్డిపేట్

నాగిరెడ్డిపేట్ మండల కేంద్రంలో గల కస్తూర్బాగాంధీ పాఠశాలలో 270 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. అయితే విద్యార్థినిలు సమయానికి భోజనం దొరక్క అల్లాడిపోతున్నారు. గ్రామాలలో చదవడానికి సరైన వసతులు లేని పేద విద్యార్థులు చదువుకోవడానికి మండల కేంద్రంలో కస్తూర్బా గాంధీ విద్యార్థినిల పాఠశాలలతో పాటు వసతి గృహాన్ని ఏర్పాటు చేసింది ప్రభుత్వం. అయితే ఆ విద్యార్థులకు ఆదివారం ఉదయం 7 గంటలకు పెట్టాల్సిన టిఫిన్.. 11 గంటలు దాటిపోయినా.. టిఫిన్ పెట్టకపోవడంతో ఆ నోట ఈ నోట ఈ విషయం బయటకు పొక్కింది. ఆదివారం 11 దాటినా టిఫిన్ పెట్టకపోవడంపై విద్యార్థుల తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. విద్యార్థినిల తల్లిదండ్రులు ఇచ్చిన సమాచారం మేరకు కస్తూర్బాగాంధీ పాఠశాల చేరుకుని విద్యార్థులతో విషయంపై ఆరా తీయగా.. ప్రతి ఆదివారం ఉదయం 11గంటల తర్వాతే టిఫిన్ పెడుతున్నట్లు పేర్కొన్నారు. అదేవిధంగా ఆదివారం మధ్యాహ్న భోజనం మూడు తర్వాతే పెడుతున్నారని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేశారు.

సరిపడా కర్రీ వేయట్లే..

ప్రతిరోజు వంట మనుషులు వంట వండిన తర్వాత విద్యార్థులకు భోజనం పెట్టే సమయంలో విద్యార్థులకు సరిపడా కర్రీ వేయడం లేదని విద్యార్థులు అంటున్నారు. ఒకేసారి ఒకే స్పూన్‌తో కర్రీ వేసిన తర్వాత తిరిగి మళ్ళీ కర్రీ కావాలంటే 'లేదు. అయిపోయింది.' అని వంట మనుషులు సమాధానాలు చెబుతున్నారని విద్యార్థులు పేర్కొన్నారు. మాడిపోయిన చపాతీలు ఇస్తున్నారని విద్యార్థులు పేర్కొన్నారు. తమకు సరిగ్గా భోజనం పెట్టడం లేదని, ఎవరికి చెప్పుకోవాలో తెలియక విద్యార్థినిలు తమలో తామే కుమిలిపోతున్నారు.

ఆలస్యంగా భోజనం వడ్డింపు..

ఉదయం 6:30కు వచ్చి విద్యార్థినులకు అల్పాహారం అందించాల్సిన వంట మనుషులు ఆలస్యంగా వచ్చి తమకు వంట ఆలస్యంగా చేసి పెడుతున్నారని విద్యార్థినిలు పేర్కొన్నారు. ఉదయం 10 గంటల వరకు విధులు నిర్వహించే ఉపాధ్యాయురాలు విద్యార్థులు తినకముందే వెళ్లిపోవడంతో విద్యార్థులకు ఏం చేయాలో అర్థం కాని పరిస్థితి ఏర్పడింది. సంబంధిత అధికారులు కేజీబీవీ పాఠశాలను సందర్శించి సమస్యలు పరిష్కరించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

> ఉదయం 11 దాటినా విద్యార్థులకు అందని టిఫిన్.. మధ్యాహ్నం 3 అయితే గానీ పెట్టని భోజనం.. ఇదీ కస్తూర్బా పాఠశాల విద్యార్థుల దుస్థితి. సమయానికి టిఫిన్, భోజనం అందకపోవడంతో ఆకలితో అల్లాడుతున్నారు. ఈ విషయమై వంట నిర్వాహకులకు ప్రిన్సిపాల్ చెప్పినా తీరు మారడం లేదు. ప్రతీ ఆదివారం ఇదే తంతు కొనసాగుతోందని విద్యార్థులు వాపోతున్నారు.



సరిగా భోజనం పెట్టడం లేదని మీడియాతో మాట్లాడుతున్న విద్యార్థినీలు.. 11 గంటలకు చపాతీలు చేస్తున్న వంట మనుషులు..

సమయానికి భోజనం పెట్టేలా చూస్తాం

ఆదివారం కావడంతో తాను విధులకు రాలేకపోయాను. వంట మనుషులు సరైన సమయానికి భోజనం పెట్టకపోవడం సరికాదు. రేపటినుంచి కచ్చితంగా మెనూ ప్రకారం సమయానికి భోజనం పెట్టే విధంగా చూస్తాను. వంట మనుషులకు కౌన్సెలింగ్ నిర్వహించి విద్యార్థులకు ఇబ్బంది పడకుండా చూస్తాను.

– ప్రిన్సిపాల్ వీణ

నిధులు మంజూరు చేయాలని వినతి

నవతెలంగాణ-ధర్పల్లి

తమ గ్రామానికి నిధులు మంజూరు చెయ్యాలని మండలంలోని సీతాయిపేట్ గ్రామస్తులు రూరల్ ఎమ్మెల్యే డా.భూపతి రెడ్డికి ఆ గ్రామ సర్పంచ్ లోక్కిడి రాములు ఆధ్వర్యంలో గ్రామ అభివృద్ధి సభ్యులు కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. ఆదివారం అభివృద్ధిపనులపై గ్రామానికి వచ్చిన ఆయన వినతిపత్రాన్ని అందజేసి సమస్యలను వివరించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ.. తమ గ్రామంలోని ఎల్లమ్మ వద్ద చెక్ డ్యామ్ నిర్మాణం చేపట్టాలని, అలాగే బీటీ రోడ్డు నుండి కల్యాణమండపానికి ప్రహరి గోడతోపాటు మండపం వరకు సీసీ రోడ్డుకు నిధులు సమకూర్చాలని కోరారు. తమ గ్రామంలో 2011 జనాభా లెక్కల ప్రకారం అప్పుడు తమ గ్రామంలో 60 వేల కెపాసిటీ గల మంచినీటి ట్యాంక్ నిర్మించారని, అది ఇప్పుడు శిథిలావస్థకు చేరి మంచినీటికి ఇబ్బందులు అవుతున్నాయని తెలిపారు. ప్రస్తుతం తమ గ్రామ జనాభా సుమారు 2 వేలకు పైగా ఉన్నందున లక్ష 20 వేల కెపాసిటీ గల మంచినీటి ట్యాంక్ నిర్మాణం చేపట్టి తగు నీటి సమస్యను తీర్చాలని కోరగా స్పందించిన ఎమ్మెల్యే అధికారులతో మాట్లాడి నిధులు అందించేందుకు కృషి చేస్తానని అన్నారు. అనంతరం గ్రామపెద్దలు ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో విడిసి సభ్యులు, గ్రామస్తులు, ముదిరాజ్ కులస్థులు పాల్గొన్నారు.


ఎమ్మెల్యేకు విన్నవిస్తున్న గ్రామస్తులు

నేడు ఆదర్శ పాఠశాలను సందర్శించనున్న ఎమ్మెల్యే

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి


మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలను నిజామాబాద్ రూరల్ నియోజకవర్గ శాసనసభ్యులు శ్రీ రేకులపల్లి భూపతిరెడ్డి సోమవారం ఉదయం 10.30 గంటలకు జక్రాన్‌పల్లి మండల కేంద్రంలో గల ఆదర్శ పాఠశాల కళాశాల (మోడల్ స్కూలు)ను సందర్శించనున్నారని, కావున మండల స్థాయి అధికారులు తప్పకుండా రావలసిందిగా ప్రిన్సిపాల్ రాజేష్ రెడ్డి కోరారు.


8 మండలాలకు ఒకే ఒక్కడు

రోజుకో మండలంలో పర్యవేక్షణ విధులు.. పనిభారంతో ఎంఈఓకు ఇబ్బందులు..

- పర్మినెంట్ ఎంఈఓను భర్తీ చేయని వైనం
- గాడి తప్పుతున్న విద్యావ్యవస్థ

> ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేస్తున్నామని, విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడానికి కృషి చేస్తున్నామని ఒకవైపు ప్రభుత్వ పెద్దలు ప్రతి సమావేశాలలో గొప్పగా ప్రసంగిస్తున్నారు. కానీ క్షేత్ర స్థాయిలో చెప్పిన దానికి పొంతన లేకుండా పోతోంది. విద్యా వ్యవస్థను క్షేత్రస్థాయిలో గాడీలో పెట్టడానికి, పాఠశాలలను నిరంతరం తనిఖీలు చేస్తూ విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడానికి, వారి సమస్యలను పరిష్కరించడానికి మండల విద్యాధికారి ప్రధాన బాధ్యత కలిగి ఉంటారు. అంతేకాకుండా పాఠశాలలకు సంబంధించిన పనులు, ఉపాధ్యాయులకు సంబంధించిన ముఖ్యమైన పనులను ఆయన సమీక్షించి జిల్లా విద్యాధికారికి పంపవలసి ఉంటుంది. అంతటి కీలకమైన మండల విద్యాధికారి పోస్టులు జిల్లాలో ఖాళీగా ఉండడంతో పలు మండలాల్లో ఇన్చార్జిగా ఉన్న ఒక్కరిపైనే పని భారం ఎక్కువవుతుంది. దానికి నిదర్శనమే బోధన్ మండలం.




ఎనిమిది మండలాలకు ఎంఈఓగా విధులు నిర్వహిస్తున్న నాగనాథ్

నవతెలంగాణ-బోధన్

బోధన్ మండల విద్యాధికారిగా నాగనాథ్ విధులు నిర్వహిస్తున్నారు. ఇంతవరకు బాగానే ఉన్నా బోధన్ మండలంతో పాటు సాలూర, కోటగిరి, పోతంగల్ మండలాల బాధ్యతలు సైతం ఆయనే చూస్తున్నారు. ప్రస్తుతం ఉపాధ్యాయుల బదిలీలలో భాగంగా ఆయన కోటగిరి మండలం నుంచి వర్ని మండలం గోవూర్ హైస్కూల్‌కు హెచ్ఎంగా బదిలీ అయ్యారు. దాంతో అధికారులు ఆయనను వర్ని మండలంలోని మోస్రా, చందూర్, వర్ని, రుద్రూర్ మండలాలకు ఇన్చార్జ్ ఎంఈఓగా నియమించారు. అంతేకాకుండా కోటగిరి మండలం జల్లాపల్లి ఫారం, ఆబాది గ్రామాలకు ఆయన ప్రత్యేక అధికారిగా ఉన్నారు. ఒకే అధికారికి ఇన్ని బాధ్యతలు అప్పగించడంతో పనిభారంతో ఆయన ఇబ్బందులకు గురవుతున్నారు. ఒకే వ్యక్తికి 8 మండలాలకు ఎంఈఓగా నియమించడంతో ఆయన రోజుకో మండలానికి తిరగవలసి వస్తుంది. అయినా కూడా పనులు సకాలంలో పూర్తికాక ఇబ్బందులు పడుతున్నట్లు సమాచారం. అలాగే పాఠశాలల పరిరక్షణ, ఉపాధ్యాయుల సమస్యలు తదితర అంశాలను ఆయన పర్యవేక్షించవల్సి ఉంటుంది.

బోధన్ మండలంలో 40 ప్రాథమిక పాఠశాలలు, ప్రాథమికోన్నత పాఠశాలలు 14, ఉన్నత పాఠశాలలు 11 ఉన్నాయి. అలాగే దానికి తోడు ప్రైవేటు పాఠశాలలు సైతం అధికారుల ఆదేశాల మేరకు తనిఖీలు చేపట్టాల్సి ఉంటుంది. బోధన్ మండలంలో సుమారు 200లకు పైగా ఉపాధ్యాయులు విద్యాబోధన చేస్తుంటారు. 6000 వరకు విద్యార్థులు ఉంటారు. ఈ పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత ఉన్నచోట సిబ్బంది సర్దుబాటు చేయడం, అలాగే అమ్మ ఆదర్శ పాఠశాలలో పనులు పర్యవేక్షణ, మధ్యాహ్న భోజనం సక్రమంగా అమలు చేయడం, వాటిని పరివేక్షించవలసి ఉంటుంది. అలాగే ఉపాధ్యాయులకు శిక్షణ కార్యక్రమాలను నిర్వహించడం, విద్యార్థులకు ఏకరూప దుస్తులు సకాలంలో అందించడం, పాఠ్యపుస్తకాలను సరఫరా చేయడం ఈ పనులన్నీ ఆయన పరిధిలోనే జరుగుతాయి. అలాగే ప్రధానోపాధ్యాయులకు కాంప్లెక్స్ సమావేశం నిర్వహించడం, ప్రభుత్వ ఆదేశాలను ఈ సమావేశంలో వివరించి ఆయా బాధ్యతలను సక్రమంగా నిర్వహించేలా ఆయన పర్యవేక్షణ చేయాల్సి ఉంటుంది. ఇలా ఒక మండల విద్యాధికారి ఇన్ని బాధ్యతలను నిర్వహించవలసి ఉంటుంది. కానీ అధికారులు ఒకే వ్యక్తికి 8 మండల బాధ్యతలు అప్పగిస్తే ఆయన ఎలా పని చేయాలో ఉన్నతాధికారులకే తెలియాలి. ఒకవైపు ప్రభుత్వం పాఠశాలలను బలోపేతం చేస్తున్నామని, ఖాళీలను భర్తీ చేసేలా చర్యలు తీసుకుంటున్నామని చెబుతున్నారు. కానీ గత కొన్ని సంవత్సరాల నుండి బోధన్ మండలానికి మాత్రం ఇన్చార్జి ఎంఈఓతోనే కాలం వెళ్లదీస్తున్నారు. ప్రస్తుతం ఏకంగా బోధన్ మండల ఇన్చార్జి నాగనాథ్ ఎంఈఓగా 8 మండలాలకు ఇన్చార్జిగా వ్యవహరించడంతో ఎక్కడి సమస్య అక్కడే ఉన్నట్లు తయారయింది.

> **ఎమ్మెల్యే స్పందించాలి..**
> బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి ఇప్పటికైనా స్పందించి బోధన్ మండలానికి ప్రత్యేక మండల విద్యాధికారిని నియమించాలని విద్యార్థి సంఘాలు, ఉపాధ్యాయ సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

దొంగలని తిట్టుకున్నారు.. దోస్తులయ్యారు..

- మా ముఖ్యమంత్రి మాకూ హక్కులు ఇచ్చారు
- కార్యకర్తలను పోచారం భయపెట్టడం సరికాదు
- మాజీ ఎంపీటీసీల ఫోరం అధ్యక్షులు శ్రీనివాస్‌రావు


మాట్లాడుతున్న మాజీ ఎంపీటీసీల ఫోరం అధ్యక్షులు శ్రీనివాస్‌రావు

నవతెలంగాణ-వర్ని

నియోజకవర్గంలో మాజీ స్పీకర్, శాసనసభ్యులు పోచారం శ్రీనివాస్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీ నాయకులైన కాసుల బాలరాజును పలు సభలలో బైకు దొంగలు చేసే వ్యక్తి నన్ను విమరస్తాడా..? అంటూ తిట్టి.. ఇప్పుడు దొంగలు అనుకున్న వారే దోస్తులు అవ్వటం చూసిన జనాలు నవ్వుకుంటున్నారని మాజీ ఎంపీటీసీల కాంగ్రెస్ పార్టీ ఫోరం అధ్యక్షులు ఎలమంచిలి శ్రీనివాసరావు విమర్శించారు. ఆదివారం వర్ని మండల కేంద్రంలో విలేకరుల ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. పోచారం శ్రీనివాస్‌రెడ్డి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానించడం జరిగిందని దానిని అలుసుగా తీసుకొని బాన్సువాడ నియోజకవర్గంలోని తమ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలను ఇబ్బందులకు గురి చేస్తే, భయభ్రాంతులకు గురిచేస్తే ఊరుకునే రోజులు లేవని అన్నారు. మొన్న అసెంబ్లీ ఎన్నికలలో కొద్దిపాటి మెజార్టీతో మీరు గెలుపొంది, గత పార్లమెంటు ఎన్నికలలో మీ గత బిఆర్ఎస్ పార్టీ మూడో స్థానానికి పడిపోయిందన్నారు. మూడో స్థానంలో పార్టీ నుంచి వచ్చిన మొదటి స్థానంలో ఉన్న కాంగ్రెస్ పార్టీలో చేరి ఇక్కడి ప్రజలకు కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేస్తామని చెప్పుకోవటం సిగ్గుచేటని విమర్శించారు. 'పోచారం శ్రీనివాస్ రెడ్డి మీకు పార్టీ కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు అవసరం లేదు.. పదవులే ముఖ్యం.. అందుకే కాంగ్రెస్‌లోకి వచ్చారు.' అని విమర్శించారు. తమకు నియోజకవర్గంలో మాత్రం మా ఇంచార్జి ఏనుగు రవీందర్‌రెడ్డినే లీడర్ అని, ముఖ్యమంత్రే స్వయంగా మాతో చెప్పినారని తెలిపారు. నియోజకవర్గంలో గత రెండు దఫాలు కాంగ్రెస్ పార్టీ ఓటమికి కాసుల బాలరాజు గ్రామాలలో తిరుగకపోవటం కాదా అని ప్రశ్నించారు. ఏది ఏమైనా మాకంటూ మా కాంగ్రెస్ పార్టీ జెండాలు మోసిన వారికి రాబోయే ఎన్నికలలో పదవులు నామినేటెడ్ పోస్టులు ఇస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ డెలిగేట్ గంగాప్రసాద్, సీనియర్ నాయకులు రమేష్ రాథోడ్, బద్యానాయక్, జాకోరా సొసైటీ చైర్మన్ దశరథ్, కిసాన్ ఖేత్ అధ్యక్షులు గంగప్ప, నారగౌడ్, చందూర్ మాజీ వైస్ ఎంపీపీ దశగౌడ్, రెడ్డిరాంబాబు, రాంబాబు, శ్రీనగర్ సురేష్, పలు గ్రామాల కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

డీఈవోను సస్పెండ్ చేసి సమగ్ర విచారణకు ఆదేశించాలి

- డిటిఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుల శంతన్

నవతెలంగాణ-కంఠేశ్వర్

ఉపాధ్యాయుల పదోన్నతుల్లో కామ్ స్కానింగ్ స్కాం జరిగిందనడానికి బయటకు వస్తున్న అక్రమాలు, సరిదిద్దే ప్రయత్నంలో అనేక మోడిఫికేషన్స్‌పై డిఈఓను తక్షణమే సస్పెండ్ చేసి సమగ్ర విచారణకు ఆదేశించాలని డిటిఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు శాంతన్ ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఇటీవల స్కూల్ అసిస్టెంట్ల పదోన్నతుల్లో డైరెక్టరేట్ కార్యాలయం నుండి పంపించిన పదోన్నతుల జాబితాలను కామ్ స్కాన్ ద్వారా జిల్లా విద్యాశాఖ ఎడిట్ చేసి అక్రమాలకు పాల్పడిన విషయం గత వారం దినపత్రికల్లో పతాక శీర్షికన కథనాలు ప్రచురితమయ్యాయని పేర్కొన్నారు. ఈ స్కామ్ వల్ల సీనియర్ ఉపాధ్యాయులకు అన్యాయం జరిగిందని, వీరికి వెబ్ కౌన్సిలింగ్ ద్వారా అలాట్ అయిన పాఠశాలలను జూనియర్లకు మోడిఫికేషన్ చేయడం వల్ల సీనియర్ ఉపాధ్యాయులు తమకు జరిగిన అన్యాయాన్ని ఉన్నతాధికారులకు ఫిర్యాదులు చేశారని తెలిపారు. దీంతో జిల్లా విద్యాశాఖ చేసిన అక్రమాలను (స్కామ్) కప్పిపుచ్చుకునేందుకు ఫిర్యాదులు చేసిన ఉపాధ్యాయులను బుజ్జగించే పనిలో పడి ఒక్కొక్కరిని డీఈఓ ఆఫీస్‌కు పిలిపించుకొని అనధికార వ్యక్తులతో కౌన్సిలింగ్ ఇప్పించడం, అలాట్ పాఠశాలలో జాయిన్ కావాలని ఒత్తిడి చేయడం ద్వారా కొంతమంది చేసేదేమీ లేక అయిష్టంగానే తమకు జరిగిన అన్యాయాన్ని ఎదిరించలేక జాయిన్ అయ్యారని పేర్కొన్నారు. కానీ మరికొందరు తమకు జరిగిన అన్యాయంపై న్యాయం జరగాలని, తనకు అలాట్ అయిన పాఠశాల ఫిలప్ అయిఉన్నందున బాధితులకు అనుకూలమైన పాఠశాలలను (కోరుకున్న చోటు) బదిలీ చేసిన వ్యవహారం ఒక్కొక్కటిగా బయటికి వస్తున్నాయని పేర్కొన్నారు. దీనిని బట్టి కామ్ స్కానింగ్ స్కాం జరిగిందనడానికి బలమైన ఆధారాలు లభించినట్లు అయిందని, అక్రమ మోడిఫికేషన్లు ఒక్కొక్కటిగా బయటపడుతున్నాయని తెలిపారు. ప్రస్తుతం సోషల్ స్టడీ సబ్జెక్టులో లోకల్ బాడీ తెలుగు మీడియంలో 18 రోస్టర్ పాయింట్‌లో ఉన్న ఉపాధ్యాయుడుకి అలాట్ అయిన పాఠశాలను మార్చడం వల్ల తను కోరుకొనని లెఫ్ట్ ఓవర్ వేకెన్సీ పేరుతో మరో పాఠశాల జెడ్పీఎస్ఎస్ ఏర్గట్ల అలాటైందని పేర్కొన్నారు. మొత్తం 80 పదోన్నతులు ఇస్తే 18వ రోస్టర్‌పై కోరుకున్నది ఎలా దక్కదు? ప్రస్తుతం ఆయనకు జరిగిన అన్యాయంపై పాఠశాల డైరెక్టర్‌కు చేసిన ఫిర్యాదుతో జిల్లా విద్యాశాఖ అధికారి ఆయనకు కేటాయించబడ్డ జడ్పీహెచ్ఎస్ ఏర్గట్లను మోడిఫికేషన్ చేస్తూ మరొక్క పాఠశాల యుపిఎస్ గాంధీనగర్ జక్రాన్‌పల్లి మండలానికి ఉత్తర్వులు ఇవ్వడంతో ఈనెల 4న అక్కడ జాయిన్ అయ్యారని తెలిపారు. ఫలితంగా ఈ పాఠశాలలో విద్యార్థులు లేరని, ఆరు, ఏడు తరగతులలో విద్యార్థుల సంఖ్య జీరో కావడంతో ఈ పాఠశాలను బ్లాక్ లిస్టులో ఉంచారని పేర్కొన్నారు. వన్ టు ఫిఫ్త్ 18మంది విద్యార్థులు ఉన్నారని, ప్రస్తుతం ఈ పాఠశాలలో ఇద్దరు స్కూల్ అసిస్టెంట్లు, ఒక ఎస్జీటీ, ఇద్దరు పండితులు పనిచేస్తున్నారని తెలిపారు. బ్లాక్‌లో ఉన్న ఖాళీని డీఈఓ ఓపెన్ చేసి ఇవ్వడం బట్టి చూస్తే అక్రమాలు ఏ స్థాయిలో జరుగుతున్నాయో అర్థం చేసుకోవచ్చని పేర్కొన్నారు. ఇలా బ్లాక్ పాఠశాలను ఓపెన్ చేయడానికి డైరెక్టర్ అనుమతి ఉండాలని, కావున విద్యార్థులు లేని పాఠశాలకు పోస్టు ఓపెన్ చేసే అవకాశమే లేదంటే డిఇఓ ఉన్నతాధికారుల అధికారాలను సైతం తానే ఉపయోగిస్తున్నట్లు అర్థమవుతుందని తెలిపారు. ఫలితంగా జడ్పీహెచ్ఎస్ ఏర్గట్లలో పదోన్నతిలో వచ్చిన మరొకరు కూడా మాడిఫికేషన్ ద్వారా జాయిన్ కాకపోవడంతో ఇక్కడ 275 మంది విద్యార్థులకు కనీసం ఒక ఉపాధ్యాయుడు కూడా లేని దుస్థితి ఏర్గట్ల పాఠశాల ఎదుర్కొంటొందని పేర్కొన్నారు.

మాజీ గవర్నర్‌కు నివాళి

నవతెలంగాణ-ఆర్మూర్

బిజెపి ఉమ్మడి రాష్ట్ర ఆంధ్ర ప్రదేశ్ అధ్యక్షులు, సిక్కిం రాష్ట్ర గవర్నర్‌గా బాధ్యతలు నిర్వహించిన కీర్తిశేషులు రామారావుకు ఆదివారం బిజెపి జాతీయ నాయకులు లోక భూపతి రెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి జెస్సు అనిల్ కుమార్ హైదరాబాదులో నివాళి అర్పించారు. ఆయన సతీమణి వసంతతో మాట్లాడారు. కార్యక్రమంలో గిరిజన మోర్చ పట్టణ అధ్యక్షులు కేలోత్ పీర్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.


నివాళి అర్పిస్తున్న నాయకులు

ఆర్టీసి కాలనీలో ఆలయ కమిటీ ఏకగ్రీవం

నవతెలంగాణ - మాక్లూర్

మండలంలోని మానిక్ బండారు గ్రామ శివారులో గల ఆర్టీసీ కాలనీ గల శ్రీ శక్తిమాన్ హనుమాన్ దేవాలయ నూతన కమిటీని కాలనీ వాసులు ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఏకగ్రీవంగా నూతన ఆలయ కమిటీ రెండు సంవత్సరాలు కొనసాగుతుందని కాలనీ అభివృద్ధి కమిటీ అధ్యక్షులు ఎస్. రాజేందర్ తెలిపారు. ధ్రువ పత్రాలను ఆలయ నూతన కమిటీకి అందజేశారు. ఆలయ కమిటీ అధ్యక్షులుగా జి.హనుమంత్ రెడ్డి ,ప్రధాన కార్యదర్శిగా జి.సుదర్శన్ గౌడ్, కోశాధికారిగా డివి.రాములు, మిగత వారిని కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో కాలనీ అభివృద్ధి కమిటీ గౌరవ అధ్యక్షులు కె.సత్యం రెడ్డి, ప్రధాన కార్యదర్శి ఎం.రోహిత్, కోశాధికారి వి.సుమన్, ఉపాధ్యక్షులు ఎస్.రాజేశ్వర్ రావు, సంయుక్త కార్యదర్శి ఎం.వేణు, సభ్యులు జి.పుష్పలత, రంగాచారి, ఏ. నాగభూషణం, కాలనీ వాసులు పాల్గొన్నారు.

బదిలీ అయిన ఎస్‌జిటిలను వెంటనే రిలీవ్ చేయాలి

- బీసీ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షులు మాడవేడి వినోద్ కుమార్


మాట్లాడుతున్న మాడవేడి వినోద్‌కుమార్

నవతెలంగాణ-కంఠేశ్వర్

బదిలీ అయినా ఎస్జిటి ఉపాధ్యాయులను వెంటనే రిలీవ్ చేయాలని బిసి ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షులు మాడవేడి వినోద్ కుమార్ తెలియజేశారు. ఆదివారం జిల్లా కేంద్రంలో బిసి ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇటీవల జరిగిన ఉపాధ్యాయుల బదిలీల్లో ఒకే పాఠశాలలో దాదాపు 13 సంవత్సరాలు పనిచేసి బదిలీ అయిన తరువాత కూడా వారిని రిలీవ్ చేయకపోవడం బాధాకరమన్నారు. బదిలీ అయిన ఎస్జీటీ ఉపాధ్యాయులను వెంటనే రిలీవ్ చేసి ఖాళీలను విద్యావాలంటీర్లతో భర్తీ చేయాలన్నారు. ఆప్షన్లకు తగు సమయం ఇవ్వక సాంకేతిక, ఇతర కారణాలతో నష్టపోయిన ఉపాధ్యాయులకు న్యాయం చేయాలని, స్కూల్ అసిస్టెంట్ పదోన్నతుల్లో పలువురు ఉపాధ్యాయులకు ఒకటి కంటే ఎక్కువ సబ్జెక్టులలో పదోన్నతి వచ్చిందని, ఎంపిక చేసుకున్న సబ్జెక్టు పోగా, మిగిలిన వారు పదోన్నతి తిరస్కరించిన సబ్జెక్టు ఖాళీలను, తదుపరి అర్హత కలిగిన ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించాలన్నారు. బిసి ఉద్యోగులకు ప్రమోషన్లలో రిజర్వేషన్లు కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సమావేశంలో బిసి ఉపాధ్యాయ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రాఘవాపురం గోపాలకృష్ణ, ఉపాధ్యక్షులు జె.శ్రీనివాస్, గౌరవ సలహాదారులు రమణ స్వామి, డిచ్‌పల్లి మండలం అధ్యక్షులు కొట్టాల రామ కృష్ణ, మహిళా ఉపాధ్యక్షురాలు బోగ ప్రతిభ, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత లక్ష్యంతో చదవాలి

- మంత్రి పొన్నం ప్రభాకర్
- క్షత్రి సమాజ్ విద్యార్థులకు సన్మానం


మంత్రిని సన్మానిస్తున్న క్షత్రియ సమాజ్ నాయకులు

నవతెలంగాణ-ఆర్మూర్

క్షత్రియ సమాజ్ విద్యార్థులు ఉన్నత లక్ష్యాలతో ప్రణాళికా బద్ధంగా చదివి విజయానికి బాటలు వేసుకోవాలని బీసీ సంక్షేమ శాఖ రవాణా శాఖా మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. శ్రీ సోమ వంశీయ సహస్రార్జున క్షత్రియ (ఖత్రి/పట్కరి) ప్రాంతీయ సమాజ్ ఆధ్వర్యంలో రాష్ట్ర అధ్యక్షులు రిటైర్డ్ ఐపీఎస్ అధికారి డాక్టర్ విశ్వనాథ్ రవీందర్ . అధ్యక్షతన సికింద్రాబాద్‌లోని జీడిమెట్లలో గల ఎస్ఎస్‌కే సమాజ్ కమ్యూనిటీ హాల్‌లో రాష్ట్ర వ్యాప్తంగా క్షత్రియ ఖత్రి కులానికి చెందిన ఉత్తమ విద్యార్థిని, విద్యార్థులను ప్రోత్సహించడానికి ఇన్స్పిరేషన్ ప్రోగ్రాం-2024 ద్వారా ఎస్ఎస్‌సీ, ఇంటర్, ఐఐటీ, ఎంబీబీఎస్‌లలో అత్యుత్తమ ప్రదర్శన కనబరిచిన స్టూడెంట్స్‌ను సన్మానించారు. ముఖ్య అతిథుల చేతులమీదుగా సహస్రార్జున చిత్ర పటానికి ప్రత్యేక పూజలు చేసి, జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మంత్రి మాట్లాడారు. పట్టుదల, క్రమశిక్షణ, ఉన్నత లక్ష్యం, కృషి ఉంటే ప్రతి విద్యార్థి ఉన్నత స్థానాలను చేరుకోవచ్చన్నారు. విద్యార్థులను ప్రోత్సహిస్తూ నిరుద్యోగం, పేదరికం రూపుమాపడానికి మిషన్ ఉథాన్ కార్యక్రమం చేపట్టడం గొప్ప విషయమని కమిటీ సభ్యులకు అభినందించారు. విశిష్ట అతిథి క్షత్రియ కులానికి చెందిన ఐపిఎస్ అధికారి అక్షయ్ అనిల్ వాఖరే మాట్లాడుతూ విద్యార్థులు విజయం సాధించాలంటే ఉన్నత లక్ష్యం ప్రణాళిక బద్ధ కఠిన పరిశ్రమ ఉండాలని అన్నారు. సభకు అధ్యక్షత వహించిన క్షత్రియ ప్రాంతీయ సమాజ్ అధ్యక్షులు ఆర్టీసీ ముఖ్య కార్యనిర్వహణ అధికారి డాక్టర్ విశ్వనాథ్ రవీందర్ మాట్లాడుతూ.. ప్రతి విద్యార్థి కష్టపడి చదివి ఐఏఎస్, ఐపీఎస్ లక్ష్యంగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ప్రాంతీయ సమాజ్ సలహాదారులు, అఖిల భారత క్షత్రియ సమాజ్ ఉపాధ్యక్షులు విశ్వనాథ్ బాలకిషన్ మాట్లాడుతూ.. తల్లిదండ్రులు విద్యార్థులను ఉన్నత చదువులకు ప్రోత్సహించాలన్నారు. వివిధ ప్రాంతాల నుంచి హాజరైన క్షత్రియ కమ్యూనిటీలోని ఉత్తమ విద్యార్థిని, విద్యార్థులకు ముఖ్య అతిథుల చేతుల మీదుగా ఘన సన్మానం చేశారు. సమాజ్ కోసం నిస్వార్థంగా సేవ చేస్తున్న ఆలూర్ గ్రామానికి చెందిన బోబడే గంగా కిషన్‌కు "ఉత్తమ సమాజ్ సేవా పురస్కార్" అవార్డు అందజేసి సన్మానించారు. ముఖ్య అతిథులకు వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన సమాజ్ అధ్యక్షులకు శాలువా మెమోంటోలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో క్షత్రియ సమాజ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టంకు విష్ణు, కార్యక్రమ కన్వీనర్ సిరిగిరి రాంకిషన్ రావు, ఉపాధ్యక్షులు నాగూరావు నామాజీ, అల్జాపూర్ శ్రీనివాస్, పుజారి రాజేశ్వర్, గుజరాతి రాజేశ్వర్, కోశాధికారి దినేష్ వైద్య, రాష్ట్ర కార్య నిర్వహణ కార్యదర్శి ఖాందేశ్ శ్రీనివాస్, క్షత్రియ ప్రాంతీయ సమాజ్ రాష్ట్ర, మహిళా మండలి అధ్యక్షురాలు డాక్టర్ ఎల్లమ్మ బాయి, క్షత్రియ ప్రాంతీయ యువ సమాజ్ రాష్ట్ర అధ్యక్షుడు శివ పండిత్‌తోపాటు ఆర్మూర్ క్షత్రియ సమాజ్ అధ్యక్షులు బచ్చేవాల్ రెడ్డి ప్రకాష్, కార్యదర్శి బారాడ్ గంగా మోహన్, సంయుక్త కార్యదర్శి షికారి శ్రీనివాస్, సంతని విజయ్, సభ్యులు పాల్గొన్నారు.

మండల మహిళా సమాఖ్యలో ఉద్యోగాలకు దరఖాస్తుల ఆహ్వానం

నవతెలంగాణ బాల్కొండ/మెండోరా

ఉమ్మడి మండల పరిధిలోని శ్రీరాంసాగర్ మహిళా రైతు ఉత్పత్తిదారుల కంపెనీ లిమిటెడ్ బాల్కొండ, మెండోరా, ముప్కాల్ మండలాలలోని మహిళా స్వయం సహాయక సంఘ సభ్యులకు వారి కుటుంబ సభ్యుల నుండి అర్హత గల వారు సీఈఒ, మేనేజర్,అకౌంటెంట్ ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకోవాలని ఆదివారం శ్రీరామ్ సాగర్ మహిళా రైతు ఉత్పత్తిదారుల కంపెనీ లిమిటెడ్ చైర్మన్ శృతి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఉద్యోగాలకు బిఎస్సీ అగ్రికల్చర్ మార్కెటింగ్ బిజినెస్ మేనేజ్మెంట్ లేదా డిప్లమా ఇన్ అగ్రికల్చర్ బీకాం కంప్యూటర్స్ విద్యార్హత గలవారు అర్హులని తెలిపారు. ఇట్టి దరఖాస్తులను ఈనెల 13వ తేదీ వరకు మండల కేంద్రంలోని సమాఖ్య కార్యాలయంలో సమర్పించాలని తెలిపారు. మరిన్ని వివరాలకు కార్యాలయంలో సంప్రదించాలని పేర్కొన్నారు.

ఇకనైనా ఎస్సీ వర్గీకరణ చేపట్టాలి

- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎస్సీ వర్గీకరణ చేపట్టాలి
- ఆర్మూర్ పట్టణంలో భారీ ర్యాలీ
- ఘనంగా ఎమ్మార్పీఎస్ ఆవిర్భవ దినోత్సవం

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

ఎంఆర్పిఎస్ ఆవిర్భావ దినోత్సవం, అలాగే మందకృష్ణ మాదిగ జన్మదినం సందర్భంగా నిజామాబాద్ జిల్లా కేంద్రంలో వినాయకనగర్ నుంచి నాగారం మిదుగా గాంధీచాక్, అంబేద్కర్ కాలనీ యందు ఎమ్మార్పీఎస్ అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో అవతరణ వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ చేసిన కార్యక్రమాల గురించి తెలియజేశారు. కార్యక్రమంలో మహాజన సోషలిస్ట్ పార్టీ జిల్లా అధ్యక్షులు ఎమ్మార్పీఎస్ అర్బన్ ఇంచార్జి సరికేల పోశెట్టి అధ్యక్షతన జెండా ఆవిష్కరణ చేశారు. కార్యక్రమంలో ఎంఆర్పిఎస్ అర్బన్ అధ్యక్షులు మహేష్, సంజీవ్, గంజుల రాంచందర్, గిరిబాబు శిలం యాదగిరి, కదేశి నవీన్, మహిళాసమక్య జాతీయ నాయకరాలు శేఖర్ యమున, సత్యక, అశోక్, తదితరులు పాల్గొన్నారు.

కంఠేశ్వర్ :మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి పొట్టి 30వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా నగరంలోని బోర్గం చౌరస్తాలో ఎమ్మార్పీఎస్ ఉమ్మడి జిల్లా ఇన్చార్జి నాగభూషణం ఆధ్వర్యంలో ఎమ్మార్పీఎస్ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ ఉమ్మడి జిల్లా ఇన్చార్జి నాగభూషణం మాదిగ మాట్లాడుతూ.. మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి 30ఏళ్లుగా ఎస్సీల ఏబిసిడి వర్గీకరణ జరగాలని మందకృష్ణ మాదిగ నాయకత్వంలో పోరాటం చేస్తుందన్నారు. ఏ ప్రభుత్వం వచ్చినా వర్గీకరణ చేసి మాదిగలకు న్యాయం చేస్తామని మాటిచ్చి మోసం చేస్తున్నరు తప్ప ఇప్పటివరకు మాదిగ జాతి కోసం సానుకూలంగా లేదన్నారు. మోడీ ప్రభుత్వం వర్గీకరణ చేస్తానని మాట ఇచ్చిందని, దానిని నిలబెట్టుకోవాలని మాదిగలకు న్యాయం చేయాలని అన్నారు. కేంద్రంలో బిల్లు పెట్టి మాదిగలకు సమానమైన వాటా అందించాలని బిల్లు పెట్టాలని డిమాండ్ చేసున్నా స్పందన లేకుండా పోయిందని అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి ఆరు నెలలు గడుస్తున్న అఖిలపక్షాన్ని ఢిల్లీకి తీసుకోపోకుండా మాదిగల పక్షాన మాట్లాడడం లేదు అని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నోసార్లు మోడీని కలిసిన రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అభివృద్ధి గురించి మాట్లాడుతుండే తప్ప ఏబిసిడి వర్గీకరణ పైన మాట్లాడడం లేదన్నారు. రాష్ట్రం నుంచి మాదిగల పక్షాన అఖిలపక్షాన్ని ఢిల్లీకి తీసుకువెళ్లాలని డిమాండ్ చేస్తున్నప్పటికీ పట్టించుకునే నాధుడే కరువయ్యారన్నారు. ఈ రాష్ట్ర కేంద్ర ప్రభుత్వాలు తక్షణమే బిల్లు పెట్టి మాదిగలకు న్యాయం చేసే విధంగా చొరవ చూపాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి నక్క రాజేందర్ మాదిగ, జిల్లా ఉపాధ్యక్షులు సంగం కిష్టయ్య మాదిగ, జిల్లా పట్టణ అధ్యక్షులు శివ మాదిగ, రూరల్ నియోజకవర్గం ఇన్చార్జి దీపక్ మాదిగ, గ్రామం బోర్గాం అధ్యక్షులు మనోహర్ మాదిగ, ప్రభాకర్ మాదిగ బాల నరసయ్య మాదిగ, మహేష్ మాదిగ, శంకర్ మాదిగ, తదితరులు పాల్గొన్నారు.

ఆర్మూర్:కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఎస్సీ వర్గీకరణ చేపట్టాలని మాదిగ సంఘాల యూనిటెడ్ ఫ్రంట్ రాష్ట్ర అధ్యక్షులు కొక్కెర భూమన్న అన్నారు. మాదిగ దండోరా ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఆదివారం వంద డప్పులతో పాత బస్టాండ్ నుండి ర్యాలీగా బయలు దేరి కొత్త బస్టాండ్ మీదుగా. అంబేద్కర్ చౌరస్తాలో మాదిగ అమర వీరులకు జోహార్లు అర్పించారు. డప్పు వాయిద్యాలతో కేంద్ర, రాష్ట్రాల ప్రభుత్వాలు ఎస్సి వర్గీకరణ, డప్పులు కొట్టే మాదిగలకు 5000 రూపాయల పెన్షన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు.. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో. 1994 ... ప్రకాశం జిల్లా ఈదుమూడి. . గ్రామంలో జులై 7న మొదటగా మాదిగ దండోరా ఆవిర్భవించిందని అది కాలక్రమేణా ఎంఆర్‌పిఎస్‌గా అవతరించి ఒక మాదిగలకే కాదు.. సబ్బండ వర్గాల వారికి ఎంతో మేలు చేసిందని అన్నారు. ఒక కుల సంఘం కులాలకు సంబంధం లేకుండ అన్ని జాతులకు, మతాలకు సంబంధించిన సమస్యల పట్ల పోరాటాలు చేసి సాధించిన చరిత్ర మాదిగ దండోరాదే నని అన్నారు, గుండె జబ్బు పిల్లల కోసం, వికలాంగుల. పెన్షన్, వృద్ధులు వితంతువులు కోసం, ఒంటరి మహిళల కోసం, ఎస్సీ ఎస్టీ, ఉద్యోగులకు. ప్రమోషన్లలో రిజర్వేషన్ కోసం పోరాటాలు చేసి సాధించిన చరిత్ర ఏ సంఘానికి లేదని అన్నారు. ఎస్సీ వర్గీకరణను సామాజిక కోణంలో ఆలోచించి ఎస్సీ వర్గీకరణ కు మద్దతు ఇవ్వాలని ప్రజా సంఘాలను, వివిధ రాజకీయ పార్టీలను కోరారు. కార్యక్రమంలో మాజీ ఎంపిపి పస్కా నర్సయ్య, మైలారం బాలు ఎంఆర్‌పిఎస్ మాజీ జిల్లా అధ్యక్షులు, గంగని స్వామి, మాదిగ మహాసేనా జిల్లా అధ్యక్షులు, కౌన్సిలర్ రింగుల భూషణ్, ఎల్‌టి కుమార్, మైదం బాజన్న, బచ్చపల్లి దేవయ్య, మెతరి సాయన్న, చేపూర్ మాజీ సర్పంచ్ టిసి సాయన్న, సుర్బిర్యాల్ మాజీ సర్పంచ్ గణేష్, డి.నర్సింలు, మాదిగ ఉద్యోగుల నాయకులు టీచర్ పోషన్న, కలిగోట సాయన్న మైలారం గంగాధర్, నల్ల అంజయ్య జంగం అశోక్, ఎర్రోళ్ల మల్కన్న, తిరుపతి, విప్లవ్ పాల్గొన్నారు.


కంఠేశ్వర్: ఆవిర్భావ కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు

. మందకృష్ణ మాదిగ 60వ పుట్టినరోజు పురస్కరించుకొని పట్టణంలో మాదిగ యువకులు రక్తదానం చేసి, పేద పిల్లలకు ఆహారాన్ని పంపిణీ తదితర కార్యక్రమాలను చేపట్టారు. ఈ సందర్భంగా ఎంఆర్పిఎస్ నియోజకవర్గ ఇన్చార్జ్ మైలారం బాలు మాదిగ మాట్లాడుతూ.. 1994లో పది మందితో ఆవిర్భవించిన ఎమ్మార్పీఎస్ ఉద్యమం అంచలంచలుగా ఎదిగి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రంలో అత్యంత క్రియాశీలక పాత్ర పోషిస్తుందని అన్నారు. ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ సాధన కోసం చేసిన పోరాటంవల్ల మాదిగల ఆకాంక్ష వర్గీకరణ ఫలాలను 2000 సంవత్సరం నుంచి 2004 వరకు 23 వేల ఉద్యోగాలు మాదిగ ఉపకులాల ప్రజలు పొందారని, ఉన్నత విద్య అవకాశాలు లభించాయని పేర్కొన్నారు. మాదిగల ఉద్యమంతో దేశ ప్రధానమంత్రిని ఒప్పించి మాదిగల సభకు రప్పించిన ఘనత మందకృష్ణ మాదిగదేనని, త్వరలోనే ప్రధానమంత్రి నరేంద్ర మోడీ నేతృత్వంలో ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణకు పరిష్కారం లభిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. రాజకీయ పార్టీలకు దీటుగా ప్రజల పక్షాన పోరాడుతున్న ఏకైక నాయకుడు మందకృష్ణ మాదిగ అని పేర్కొన్నారు. వికలాంగుల ఉద్యమం, ఆరోగ్యశ్రీ ఉద్యమం, వితంతువుల ఉద్యమం దళిత పీడిత వర్గాల పక్షాన అనేక పోరాటాలు నడిపి సమాజానికి ఫలితాలను అందించిందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు కనక ప్రమోద్ మాదిగ, నియెజకవర్గ కో ఇన్చార్జి శ్యామ్ మాదిగ, విప్లవ్ మాదిగ, ఇందరపు రాజు మాదిగ,శ్రీనివాస్ మాదిగ, సందీప్ మాదిగ, తెలంగాణ యూనివర్సిటీ మాదిగ విద్యార్థుల, వివిధ గ్రామాల ఎమ్మార్పీఎస్ నాయకులు పాల్గొన్నారు.


ఆర్మూర్‌లో..

పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కండి

హ్యాపీ వాకర్స్ అసోసియేషన్

నవతెలంగాణ-ఆర్మూర్

పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములై మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని పట్టణంలోని హౌసింగ్ బోర్డ్ కాలనీలో హ్యాపీ వాకర్స్ అసోసియేషన్ సభ్యులు అన్నారు. ఆదివారం వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా మొక్కలు నటారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కాంగ్రెస్ నాయకులు అయ్యప్ప శ్రీనివాస్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ పర్యావరణాన్ని పరిరక్షించుకోవాలని కోరారు. పర్యావరణాన్ని పరిరక్షించుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ లింబాద్రి గౌడ్, జిజి రామ్, పుష్పాకరావు, కామణి నరేష్,


మొక్కను నాటుతున్న వాకర్స్ అసోసియేషన్ సభ్యులు

డిఎస్ మృతి జిల్లాకు, మున్నూరు కాపులకు తీరని లోటు

- పంచముఖి మున్నూరుకాపు సంఘం

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

మున్నూరు కాపు రాజకీయ దురంధరుడు ధర్మపురి శ్రీనివాస్ మృతి నిజామాబాద్ జిల్లాకు, మున్నూరు కాపు సంఘాలకు తీరని లోటని పంచ ముఖి మున్నూరు కాపు సంఘం అధ్యక్షులు, కార్యదర్శి హరిదాస్ సాయిరెడ్డి, సంతోష్ కులచారి అన్నారు. ఆదివారం వినాయక్ నగర్‌లోని పంచముఖి మున్నూరు కాపు సంఘంలో నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో డీఎస్ మృతికి సంతాపం తెలుపుతూ మౌనం పాటించారు. మున్నూరు కాపు సంఘ అభివృద్ధికి అహర్నిశలు పాటుపడిన వ్యక్తి ధర్మపురి శ్రీనివాస్ అని, సంఘాలన్నిటిని ఒక వేదిక పైకి చేర్చి సంఘ భవనాల కోసం కృషి చేసిన గొప్ప వ్యక్తి అని కొనియాడారు. ఆయన ఆత్మకు శాంతి కలగాలని సంఘం తరపున కోరుతున్నామన్నారు. కార్యక్రమంలో కోశాధికారి యేల్మల శంకర్, గౌరవాధ్యక్షులు బొబ్బిలి కిషన్, బంటు గంగాధర్, పెద్దకాపు హరిదాసు మారుతి, ఉపాధ్యక్షులు నాగులత ధర్మేందర్, వైశాక్షి సంతోష్, కార్యనిర్వహణ కార్యదర్శి కర్క రమేష్, ప్రచార కార్యదర్శి జగదీష్, మూదం అంజనేయులు, సభ్యులు తోట నరేష్ అంజిరెడ్డి, రఘునందన్, రాజకిషన్, ప్రదీప్, ఆకుల తిర్మల్, రాజేందర్, దేవేందర్, జస్వంత్, సంతోష్, రాజన్న, మిద్దెల రాజు, గంగారం, తదితరులు పాల్గొన్నారు.

బాలకార్మికుల నిర్మూలనేది...?

- రోడ్లపై తిరుగుతున్న చిన్నారులు
- బాలల పరిరక్షణ కమిటీలెక్కడ..?
- పట్టించుకోని అధికారులు... పనిలో బాలకార్మికులు



నవతెలంగాణ-నిజామాబాద్

బాల కార్మికులను పని పెట్టుకుంటే చర్యలు తప్పవు... బాలల హక్కులను పరిరక్షించాలని అధికారులు పదేపదే చెబుతుంటారు. కాని వస్తావిక రూపం దీనికి భిన్నంగా ఉంది. బాలల దినోత్సవం, ఇతర కార్యక్రమాల్లో తప్ప మిగిత సమయాల్లో వారి గురించి పట్టించుకునే వారే లేరని చెప్పడం ఎలాంటి సందేహం లేదు. బాలల హక్కుల కోసం ప్రత్యేకంగా బాలల పరిరక్షణ సమితి జిల్లాలో పని చేస్తుంది. అడపదడప దాడులు నిర్వహించి, బాల కార్మికులను నిర్మూలిస్తున్నామని, పనిలో పెట్టుకుంటే చర్యలు తప్పవని తూతూ మంత్రంగా హెచ్చరిస్తున్నారే తప్ప కఠినంగా వ్యవహరించడం లేదనే ఆరోపణలు లేకపోలేదు. నిత్యం కార్మిక శాఖ, బాలల పరిరక్షణ సమితి, సీడబ్ల్యూసీ, చైల్డ్‌లైన్ బాల కార్మికులను గుర్తించి వారిని బడిలో చేర్పించాలి. అదే విధంగా పోలీసులు కూడా బాల కార్మికుల వ్యవస్థ నిర్మూలన కోసం ఆపరేషన్ స్మైల్ కూడా చేపడుతున్నారు. ఆపరేషన్ ముస్కాన్‌ను ఎస్పీ ఆధ్వర్యంలో బాలల రక్షణ కోసం నిర్వహించారు. ఇందులో బాల కార్మికులను గుర్తిస్తున్నప్పటికి పూర్తి స్థాయిలో నిర్మూలించడంలో విఫలమవుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. బాలల హక్కులు, బాల కార్మికుల నిర్మూలన కోసం ఆయా శాఖలు ప్రత్యేకంగా ఉన్న పోలీసులు లేనిదే వారు కూడా ముందుకు సాగడం లేదని విమర్శలు వ్యక్తమవుతున్నారు.

రోడ్లపై తిరుగుతున్న చిన్నారులు..

కుటుంబ పరిస్థితుల నేపథ్యంలో పోషణలో చిన్నారులు రోడ్లపై తిరుగుతున్నారు. చెత్తచెదారాన్ని సేకరిస్తు దాన్ని విక్రయించి ఆదాయం పొందుతున్నారు. జిల్లా కేంద్రంతో పాటు ప్రతి మండలంలో ప్రస్తుతం బాలకార్మికులు కనిపిస్తున్నారు. జిల్లా కేంద్రంలో హోటళ్లు, రోడ్లపై వీరు తిరుగుతున్నారు. నిత్యం అధికారులు వారిని చూసి కూడా చూడనట్టు వ్యవహరిస్తున్నారు. బాలల ప్రత్యేక రోజుల్లోనే అధికారులు వీరి హక్కుల గురించి మాట్లాడి నిర్మూలించే విషయంలో నిర్లక్ష్యంగా ఉన్నారనే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి.



బాలల పరిరక్షణ కమిటీలెక్కడ...?

బాలల హక్కులను పరిరక్షించడానికి ప్రభుత్వం బాలల పరిరక్షణ కమిటీలను ఏర్పాటు చేసింది. దీంతో పాటు చైల్డ్‌లైన్ కూడా పని చేస్తుంది. వీరు జిల్లా కేంద్రంలోనే ఉంటున్న ఇక్కడ గల్లీల్లో చెత్త ఎరుకుంటు తిరుగుతున్న బాల కార్మికులు కనిపించడం లేదా అని ప్రశ్నలు ప్రజల నుంచి వస్తున్నాయి. పర్యవేక్షించాల్సిన అధికారులే పట్టిపట్టనట్టు వ్యవహరిస్తున్నారని జనాలు అంటున్నారు. పట్టణంలో ఏ కాలనీలో చూసిన బాల కార్మికులు భుజాలకు గొనే సంచులు ధరించి చెత్త ఎరుకుంటు కనిపిస్తారు. ఈ విషయం అధికారులకు తెలిసిన కూడా ఎందుకు చర్యలు తీసుకోవడం లేదో అర్థం కానీ పరిస్థితి. రేపటి దేశ భవిష్యత్తు ఇలా రోడ్లపై తిరుగుతూ ఉంటే అధికారులు ఎం చేస్తున్నారు..? వారి నిర్లక్ష్యం కారణంగా ఆడుకుంటు చదువుకోవాల్సిన వయస్సులో కుటుంబ పోషణ కోసం రోడ్లపైకి రావాల్సిన దుస్థితి ఉంది. ప్రభుత్వాలు ప్రచారానికే చేసే అర్భాటం కన్న వారికి సరైన న్యాయం చేయాలని పలువురు కోరుతున్నారు.



నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నిజామాబాద్-కామారెడ్డి
సోమవారం | జులై 08, 2024 | www.navatelangana.com

మాజీ ప్రజాప్రతినిధులకు సన్మానం


మాజీ ప్రజాప్రతినిధులను సన్మానించిన పలువురు

నవతెలంగాణ-దోమకొండ

మండల కేంద్రంలోని పెద్దమ్మ ఆలయ ప్రాంగణంలో ముదిరాజ్ పెద్దమ్మ ఆలయ కమిటీ అధ్యక్షులు పున్న లక్ష్మణ్, ఆలయం కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో మాజీ జడ్పీటిసి తిరుమల గౌడ్, మాజీ ఎంపీపీ కానుగంటి శారద నాగరాజు, మాజీ ఎంపీటీసీ సభ్యులు శంకర్, కోట సదాన, కడారిరమేష్, మాజీ విజయ డైరీ మాజీ అధ్యక్షులు పున్న రాములు, మాజీ శివరాం మందిర్ ఆలయ అధ్యక్షులుఆబ్రబోయిన రాజేందర్, పలువురు ప్రజప్రతినిధులు, నాయకులను ఆదివారం ఘనంగా శాలువాకప్పి సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దోమకొండ మండల అభివృద్ధి కోసం తమ వంతు కృషి చేశామని, ప్రజల సమస్యలు పరిష్కారం కోసం ఎల్లప్పుడూ కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ముదిరాజ్ పెద్దమ్మ ఆలయం కమిటీ సభ్యులు బోయిని సత్యం, నర్సింలు, సంఘం సభ్యులు మధు, రాజు, శ్రీనివాస్, మహంకాళి తదితరులు పాల్గొన్నారు.

ఆలయ నూతన కమిటీ ఎన్నిక


ఎన్నికైన నూతన కమిటీ సభ్యులు

నవతెలంగాణ-కామారెడ్డి

పట్టణంలోని అయ్యప్ప దేవాలయ కమిటీకి జరిగిన ఎన్నికల్లో దేవాలయ కమిటీ అధ్యక్షునిగా నస్యంటి శ్రీనివాస్, కార్యదర్శి గోనె శ్రీనివాస్ ఎన్నిక కాగా వారిని అయ్యప్ప దేవాలయ భక్తులు సన్మానించారు. కార్యక్రమంలో శ్రీ రాఘవేంద్ర హెూమియో క్లినిక్ ఎండి డా.పల్స హరీష్‌గౌడ్, కోడిప్యాక సాయిరాం (జర్నలిస్ట్), పేపర్ శీను, పంపరి లక్ష్మణ్ శైలేష్, తదితరులు పాల్గొన్నారు.

బీసీ బాలికల వసతి గృహం..
మౌలిక వసతులు అస్తవ్యస్తం..

- ఇంచార్జి వార్డెన్‌తోనే సరి

నవతెలంగాణ-రెంజల్

మండల కేంద్రంలోని బీసీ బాలికల వసతి గృహంలో సమస్యలు కొట్టుమిట్టాడుతున్నాయి. తద్వారా విద్యార్థులకు తీవ్ర అవస్థలు తప్పడం లేదు. ప్రధానంగా బాత్రూమ్‌లు, మరుగుదొడ్ల డోర్లు తుప్పుపట్టి దర్శనమిస్తున్నాయి. అలాగే పూర్తిస్థాయిలో వార్డెన్ లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు.

గత 15 సంవత్సరాల కిందట మండల కేంద్రంలో బీసీ బాలికల వసతి గృహాన్ని నిర్మించారు. ఈ పాఠశాల 100 మంది బాలికలకు సరిపడా ఖాళీలు ఉన్నప్పటికీ ప్రస్తుతం 70 మంది విద్యార్థిని విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. అయితే విద్యార్థుల కోసం నిర్మించిన బాత్రూంలు, మరుగు దొడ్ల తలుపులు కింది భాగంలో తుప్పు పట్టి పూర్తిగా దెబ్బతిన్నాయి. అలాగే ఈ వసతి గృహంలో మరుగుదొడ్లు బాత్రూంలను శుభ్రపరిచే వ్యక్తి లేకపోవడంతో విద్యార్థులు నాన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

కూరగాయలు కిందనే..

విద్యార్థులకు భోజనం వండేందుకు గానూ తీసుకొచ్చిన వారం రోజులకు సరిపడా కూరగాయలు తీసుకువచ్చి కిందనే వేశారు. దాంతో దుమ్ము ధూళి కూరగాయాలకు చేరి వంటలో ఇబ్బందులయ్యే అవకాశం ఉంటుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. విద్యార్థులకు ఉదయం తాలింపు అన్నం పెట్టి పాఠశాలకు పంపించగా.. మధ్యాహ్న భోజనం విద్యార్థులు పాఠశాలలోనే చేస్తారు. అనంతరం రాత్రికి హాస్టల్ వచ్చాక భోజనం చేస్తారు.

సిబ్బంది లేక ఇబ్బందులు..

ఈ వసతి గృహానికి ప్రధానంగా సిబ్బంది లేక నానా ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. వంట చేసే నిర్వహకురాలే రాత్రి సమయంలో విద్యార్థులకు కాపలా ఉండాల్సి వస్తోంది. పూర్తిస్థాయి వార్డెన్ లేకపోవడంతో నిజామాబాద్ హాస్టల్‌లో పనిచేస్తున్న రాధా వాణిని రెంజల్ బాలికల వసతిగృహానికి ఇంచార్జిగా నియమించారు. దాంతో ఆమె రెండు రోజులకోసారి వచ్చి పిల్లల బాగోగులను చూస్తున్నారు. పూర్తిస్థాయి వార్డెన్ ఉంటే విద్యార్థులపై ఎప్పటికప్పుడు నిఘా ఉంటుందని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

వర్షాకాలం సమీపించిన వేళ.. సీజనల్ వ్యాధులు ప్రజలే అవకాశం ఉన్నందున పరిసరాల పరిశుభ్రతపై హాస్టల్ ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టిని సారించవలసిన అవసరం ఎంతైనా ఉంది. సిబ్బంది కొరతతో హాస్టల్ పరిస్థితి అధ్వాన్నంగా మారింది. విద్యార్థులకు వండే కిచెన్ రూమ్ సైతం అస్తవ్యస్తంగా ఉండడం, సిబ్బందిపై నిఘా లేకపోవడంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి వెంటనే సరిపడా సిబ్బందిని నియమించి విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలని వారు కోరుతున్నారు.


అస్తవ్యస్తంగా వంటసామగ్రి గది


వండిపెట్టే కూరగాయలు కిందనే


తుప్పుపట్టిన మరుగుదొడ్ల తలుపులు

ఎంపీటీసీ దంపతులకు సన్మానం


ఎంపీటీసీ దంపతులను సన్మానించిన పలువురు

నవతెలంగాణ-ఎడపల్లి

మండలంలోని పోచారం, జైతాపూర్, ధర్మారం, గ్రామాల ఉమ్మడి మాజీ ఎంపీటీసీ బద్దేళ్ల పద్మ ముత్తన్న పదవీ కాలం పూర్తి చేసుకున్న సందర్భంగా పోచారం గ్రామ యువకులు, పద్మ ముత్తన్న దంపతులను ఆదివారం ఘనంగా సన్మానించి సత్కరించారు. ఈ సందర్భంగా పోచారం యువ నాయకులు, గ్రామస్తులు మాట్లాడుతూ.. ఐదేళ్లపాటు ఎంపిటిసి సభ్యురాలు పనిచేసిన పద్మ ముత్తన్న దంపతులకు జ్ఞాపికను అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీటీసీ మాట్లాడుతూ.. మండల ప్రజా పరిషత్ మంజూరు చేయించి జైతపూర్, పోచారం, ధర్మారం గ్రామాల అభివృద్ధికి తన వంతు కృషి చేశానని ఆమె పేర్కొన్నారు. పోచారం, జైతాపూర్, ధర్మారం, గ్రామాల ప్రజలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఐదేళ్ల కాలం పాటు తన పదవికి న్యాయం చేశానని ఆమె తెలిపారు. ఐదేళ్ల ఎంపిటిసి పదవి కాలంలో మూడు గ్రామాల అభివృద్ధికి తనవంతు కృషి చేశానని తెలిపారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో మరోసారి సర్పంచ్‌గా లేదా ఎంపిటిసి, ఎస్సీ రిజర్వేషన్ అవకాశం వస్తే జెడ్పిటిసిగా పోటీ చేయనున్నట్టు పద్మముత్తన్న వివరించారు. బోధన్ మాజీ ఎమ్మెల్యే మహమ్మద్ షకీల్ అమీర్ దంపతుల సహాయసహకారాలతో మరో మారు పోటీ చేస్తానని పద్మ ముత్తన్న తెలిపారు.

సైబర్ నేరాలపట్ల అప్రమత్తంగా ఉండండి

- ఏఎస్ఐ రంగారావు


సైబర్ నేరాలపై అవగాహన కల్పిస్తున్న పోలీసులు

నవతెలంగాణ-లింగంపేట్

ప్రజలు సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని లింగంపేట్ ఏఎస్ఐ రంగారావు ప్రజలకు సూచించారు. ఆదివారం మండల కేంద్రంలో పలువురికి సైబర్ నేరాల పట్ల అవగాహన కల్పించారు. గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలు సైబర్ నేరాలకు గురవుతున్నారని ఆయన అన్నారు. దూర ప్రాంతాల నుంచి గుర్తు తెలియని వ్యక్తులు ఫోన్‌చేసి ఆధార్ నెంబర్, ఖాతా నెంబర్‌ను అడిగితే సమాచారం ఇవ్వవద్దని అన్నారు. ఆధార్ కార్డు నెంబర్, బ్యాంక్‌ఖాతా నెంబర్ ఇస్తే ఖాతాలోని డబ్బులు మాయమవుతాయన్నారు. ఖాతాలో నుంచి డబ్బులు మాయమైతే 1930 నెంబర్‌కు సమాచారం అందించాలని ఆయన సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో అమాయక ప్రజలను ఆసరగా తీసుకొని సైబర్ నేరగాళ్లు అక్రమాలకు పాల్పడుతున్నారని మాయ మాటలు చెప్పి డబ్బులు కాజేస్తున్నారన్నారు. గుర్తుతెలియని వ్యక్తులకు సమాచారం ఇవ్వరాదని ఆయన సూచించారు. ఈయన వెంట పోలీసు సిబ్బంది, గ్రామస్తులు ఉన్నారు.

కళ్యాణలక్ష్మీ, షాదీముబారక్ చెక్కులు పంపిణీ


కళ్యాణలక్ష్మీ, షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేసిన ఎమ్మెల్యే

నవతెలంగాణ-జుక్కల్

జుక్కల్ నియోజకవర్గంలోని పలు మండలాల లబ్దిదారులకు ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావ్ చేతుల మీదుగా కళ్యాణలక్ష్మీ, షాదీముబారక్ చెక్కులను ఆదివారం పంపిణీ చేసినట్టు జుక్కల్ కాంగ్రెస్ పార్టీ మండల వర్కింగ్ ప్రసిడెంట్ ఎ.వినోద్ తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెలే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వివిధ మండలాల నుంచి లబ్దిదారులు తరలివచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ పథకాలకు అమలు చేయడంలో కటుబడి ఉందని ఎమ్మెలే లక్ష్మీకాంతారావ్ పేర్కొన్నారు. కార్యక్రమంలో జుక్కల్ తహసీల్దార్ హిమబిందు, ఆర్ఐ రామ్ పటేల్, మండల కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, కేమ్రాజ్ కల్లాలీ మాజీ సర్పంచ్ రమేష్ దేశాయి, వివిధ మండలాల కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజల్ని ఆకట్టుకోలేకపోయాం

- మోడీకి మద్దతుగా ఓటేసిన వారికి ధన్యవాదాలు
- మాజీ జహీరాబాద్ పార్లమెంట్ సభ్యులు బీబీపాటిల్

నవతెలంగాణ-కామారెడ్డి

కామారెడ్డి శాసన సభ్యులు కాటిపల్లి వెంకట రమణరెడ్డి కృషితో కామారెడ్డిలో బీజేపీ కి అత్యధికంగా ఓట్లు వచ్చాయని, మిగితా చోట్ల ప్రజల్ని ఆకట్టుకోలేక పోయామని మాజీ జహీరాబాద్ పార్లమెంట్ సభ్యులు బీబీపాటిల్ అన్నారు. జహీరాబాద్ పార్లమెంట్ ఎన్నికల సమీక్షా సమావేశాలలో భాగంగా కామారెడ్డి జిల్లా కార్యాలయంలో కామారెడ్డి అసెంబ్లీ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అతిథిగా విచ్చేసిన మాజీ ఎంపీ బిబి పాటిల్ మాట్లాడుతూ.. మోడీకి మద్దతుగా కమలం పువ్వు గుర్తుకు ఓటు వేసిన వారికి ధన్యవాదాలు తెలిపారు. కామారెడ్డి నియోజకవర్గ కార్యకర్తలు ఇదే స్ఫూర్తితో రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో అన్ని స్థానాలు గెలవాలనీ ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమానికి అతిథిగా విచ్చేసిన పెద్దోళ్ల గంగారెడ్డి మాట్లాడుతూ.. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి నరేందర్ రెడ్డి, అసెంబ్లీ కన్వీనర్ లక్ష్మారెడ్డి, పార్లమెంట్ కో కన్వీనర్ కాసర్ల శ్రీనివాస్, పట్టణ అధ్యక్షుడు ఆకుల భరత్, కౌన్సిలర్ నరేందర్, నాయకులు సంధ్య, వేణు, బాల్ రాజు, అనిత, నెహల్, మండల అధ్యక్షులు సురేష్, అనిల్, రమేష్, భూపాల్, రంజిత్ గౌడ్, శ్రీనివాస్, సరోజ 200ల మంది కార్యకర్తలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బీబీపాటిల్

పాఠశాలల అభివృద్ధికి ప్రభుత్వ ప్రత్యేక కృషి

- ప్రహరీ నిర్మాణం భూమిపూజలో ఎమ్మెల్యే


భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే

నవతెలంగాణ-మద్నూర్

పాఠశాలల అభివృద్ధికి ప్రభుత్వ ప్రత్యేక కృషి చేస్తుందని జుక్కల్ ఎమ్మెల్యే తోటా లక్ష్మీకాంతరావు అన్నారు. మద్నూర్ మండలంలోని రాచూర్ గ్రామంలో గల ప్రభుత్వ పాఠశాల ప్రహరీ గోడ నిర్మాణం కోసం జుక్కల్ ఎమ్మెల్యే ఆదివారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పాఠశాలల అభివృద్ధికి ప్రత్యేకంగా కృషి చేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు ధరాస్ సాయిలు, మండలంలోని ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ చేయకుంటే పోరాటం

- ఎమ్మార్పీఎస్ రజతోత్సవ సంబురాలు
- జెండావిష్కరణలు
- ఘనంగా మందకృష్ణ మాదిగ జన్మదిన వేడుకలు

నవతెలంగాణ-విలేకరుల బృందం

కామారెడ్డి : భారత దేశ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ సికింద్రాబాద్‌లోని పెరేడ్ గ్రౌండ్‌లో లక్షలాది మంది నిండు సభలో ప్రధానమంత్రి కాగానే నెలరోజుల్లోనే ఎస్సీ వర్గీకరణ చేస్తానని చెప్పి ఇప్పటికీ నెలలు గడిచినా.. ఎస్సీ వర్గీకరణ చేయడం లేదని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు చిట్యాల సాయన్న, రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆర్ భాగయ్య అన్నారు. ఇప్పటికైనా వెంటనే బిజెపి పార్టీ నాయకులు, కేంద్ర మంత్రులు వెంటనే స్పందించి ఎస్సీ వర్గీకరణ చేయాలని, లేనిపక్షంలో రమేష్ కుమార్ మాదిగ ఆదేశాల మేరకు బిజెపి పార్టీ కార్యాలయాలు, మంత్రి, ఎంపీ, ఎమ్మెల్యే కార్యాలయాలను ముట్టడిస్తామని హెచ్చరించారు. మాదిగ రాజకీయ పోరాట సమితి (ఎమ్మార్పీఎస్) వ్యవస్థాపకులు జాతీయ అధ్యక్షులు బి.ఎస్ రమేష్ కుమార్ మాదిగ దండోరా 30 సంవత్సరాలు నిండిన సందర్భంగా కామారెడ్డి జిల్లా కేంద్రంలోని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు చిట్యాల సాయన్న ఆధ్వర్యంలో పార్టీ జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కొమ్ము ఈశ్వర్, కోటి అశోక్, నవాబ్ మహేష్, పోచయ్య, రామచంద్రం, రియాజ్, నిర్సర్ లక్ష్మణ్ చారి, బలరాం, పార్టీ కార్యకర్తలు నాయకులు పాల్గొన్నారు.

రెంజల్ : మండల కేంద్రమైన రెంజల్ అంబేద్కర్ విగ్రహం ఎదుట ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలతో పాటు, ఎమ్మార్పీఎస్ అధినేత మందకృష్ణ మాదిగ 60వ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించినట్టు ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మీ గారి భూమయ్య పేర్కొన్నారు. ఆదివారం ఎమ్మార్పీఎస్ జెండాను ఆవిష్కరించిన అనంతరం అధినేత మందకృష్ణ మాదిగ జన్మదిన పురస్కరించుకొని స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో నెలకొని ఉన్న సామాజిక, ఆర్థిక, రాజకీయ అసమానతలను నిర్మూలించి సామాజిక న్యాయాన్ని ప్రజలకు అందించాలన్న ఉద్దేశంతో ఎమ్మార్పీఎస్ ముందుకు సాగుతుందన్నారు. మూడు దశాబ్దాలుగా బడుగు బలహీన వర్గాల పక్షాన నిలబడుతూ జన హృదయాలలో నేటికీ చెరగని ముద్ర సంపాదించుకున్న ఎమ్మార్పీఎస్ పార్టీ అని ఆయన కొనియాడారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండల నాయకులు నరేష్, దగ్గుల సాయిలు, బత్తిరి కళ్యాణ్, లక్ష్మిగారి పోశెట్టి, దగ్గుల అశోక్, ఎల్బీ పోచయ్య, వికేష్, మహేందర్, ప్రకాష్, వినోద్, రూపేష్ తదితరులు పాల్గొన్నారు.



కామారెడ్డి: మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ నాయకులు


బోధన్‌లో...


రామారెడ్డిలో...

కామారెడ్డి : ఎమ్మార్పీఎస్ ఆవిర్భవించి 30 సంవత్సరాలు పూర్తయిన శుభ సందర్భంగా, మందకృష్ణ మాదిగ పుట్టినరోజు సందర్భంగా రెండు సంబరాలను కామారెడ్డి జిల్లా కేంద్రంలో ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షురాలు సత్తిగారి లక్ష్మీ ఆధ్వర్యంలో కేక్ కట్ మందకృష్ణ మాదిగకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. కామారెడ్డి జిల్లా ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో భాగంగా ఎమ్మార్పీఎస్ మహిళా అధ్యక్షురాలు సత్తిగారి లక్ష్మి మాట్లాడుతూ మందకృష్ణ మాది ఆధ్వర్యంలో ఎన్నో విజయాలు సాధించినట్టు తలెఇపారు. ఆరోగ్యశ్రీ ప్రధాత మందకృష్ణ మాదిగ వికలాంగులు వితంతుల కొరకు ఉద్యమం చేసినటువంటి మహానాయకుడన్నారు. మందకృష్ణ మాదిగ 500 పెన్షన్లను 2000 వరకు ఇప్పించిన చరిత్ర మందకృష్ణ మాదిగది అన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి, మాజీ బట్ట వెంకట రాములు, కొత్తల యాదగిరి, జిల్లా కార్యదర్శి మాజీ ఎంఎస్పి జిల్లా కన్వీనర్ మాజీ పుల్లూరు పురుషోత్తం, మాచారెడ్డి మండల అధ్యక్షులు బట్ట రమేష్, రామారెడ్డి మండల అధ్యక్షులు రాజ నర్సు, మహిళా అధ్యక్షురాలు లావణ్య, రాజంపేట మహిళా అధ్యక్షురాలు సుజాత, మహిళా నాయకురాలు మానస, రాజేశ్వరి, రజిత, బాబు, ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డి : ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో ఎమ్మార్పీఎస్ జెండా ఆవిష్కరించినట్లు ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి కంతి పద్మారావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎమ్మార్పీఎస్‌ను స్థాపించి 30 సంవత్సరాలు అయిందని, ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు మందకృష్ణ ఆదేశాల మేరకు ఎమ్మార్పీఎస్ జెండా ఆవిష్కరించామని పేర్కొన్నారు. ఎమ్మార్పీఎస్ స్థాపించిన అనతి కాలంలోనే ఎన్నో పోరాటాలు, ఉద్యమాలు చేసి బడుగు బలహీన పేద ప్రజల అభ్యున్నతికి కృషి చేసిందని అన్నారు. కార్యక్రమంలో రామకిష్టయ్య, ఆశయ్య సంగయ్య కిషన్, ఎంఎస్ఎఫ్ నాయకులు భూమేష్, రాజు, బాబు, నవీన్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

రామారెడ్డి : మండలంలోని ఉప్పల్‌వాయిలో ఎమ్మార్పీఎస్ 30వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జెండా ఆవిష్కరించారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మంద కృష్ణ మాదిగ 60వ జన్మదిన వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు కొత్తొల యాదగిరి మాట్లాడారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కొత్తొల గంగారాం, సాయిలు, సూరంపల్లి శంకర్, పంగ పెద్ద సాయిలు, పంగ లింగం, బాబు తదితరులు పాల్గొన్నారు.

బోధన్ : పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో ఎమ్మార్పీఎస్ 30వ విర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దండోర పతాకానిన ఆవిష్కరించారు. అలాగే మందకృష్ణమాదిగ 59 జన్మదినవేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు అబ్బయ్య, దల్లా సురేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి లసింగారి భూమయ్య, గంగాధర్ బైరంపల్లి శంకర్ , గంధమాల చంద్రయ్య , గంగన్ నరసింహులు, వినోద్, కుమార్ మాదిగ, భాషోల సాయిలు మాదిగ. మహజనా నాయకుడు అవుట్ల భాస్కర్, జిల్లా మహిళా నాయకురాలు సావిత్రి మాదిగ, బాలమని పాల్గొన్నారు.

దండోర రజథోత్సవాలకు తరలిన నాయకులు..

మాదిగ దండోర ఆవిర్భవించి 30 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ఆదివారం హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో మేడి పాపన్న మాదిగ ఆధ్వర్యంలో నిర్వహించే రజథోత్సవ వేడుకలకు బోధన్ డివిజన్ ఎమ్మార్పీఎస్ నాయకులు హైదరాబాద్‌కు తరలి వెళ్లారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు విద్యాసాగర్, దండోర సీనియర్ ఉద్యమ నేత లిటబూరి లక్ష్మణ్, జిల్లా ఉపా ఉపాధ్యక్షులు దేగం సాయిలు, జిల్లా ప్రధాన కార్యదర్శి నాగరావు, మండల అధ్యక్షులు గోపు సాయిలు, ఉద్యోగుల సంఘం నాయకులు ఆర్టీసీ సాయిలు, బోధన్ డివిజన్ అధ్యక్షులు నగేష్, మండల ఉపాధ్యక్షులు కన్నం శ్రీనివాస్ ఉన్నారు.

ఘనంగా ఎమ్మార్పీఎస్ రజతోత్సవ సంబరాలు..

సాలూర మండల కేంద్రంలోని బస్టాండ్ వద్ద గల బాబు జగ్జీవన్ రామ్ విగ్రహం ఎదుట ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో దండోర రజతోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దండోరా పతాకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ అధ్యక్షులు చంటి, గ్రామ పెద్దలు వెంకటిపటేల్, స్వామిగౌడ్, సురేష్, సంజీవ్, కే.జీ.గంగారాం, రాజగౌడ్, నజీర్, సుభాష్, లాలయ్య, లక్ష్మయ్య, నాగరావ్, లింబయ్య తదితర దండోర సంఘం నాయకులు పాల్గొన్నారు.